

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 71 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా బుధవారం 25 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 71 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, WED 25 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## విద్యుత్ భారం పడకుండా
# అప్పులు తీర్చాలి

- ఇంధన శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రజలపై భారం వేయకుండా డిస్కంల అప్పులు తీర్చాలని దిశానిర్దేశం
- విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించాలని సూచన
- ఇంధన రంగంలో ఆవిష్కరణల కోసం ప్రత్యేక ఇంక్యుబేషన్ ఫండ్
- రాష్ట్రంలో ఎనర్జీ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం



**పెన్ పవర్ డెస్క్:**ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపకుండా విద్యుత్ సంస్థల (డిస్కంల) రుణాలను తీర్చేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించే లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఇంధన శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు విద్యుత్ కొనుగోళ్ల ఖర్చు తగ్గింపుపై రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరించారు. వివిధ సంస్కరణల ద్వారా 2028-29 నాటికి యూనిట్‌పై రూ.1.32 భారాన్ని తగ్గించి, కొనుగోలు ధరను రూ.4.10కి తీసుకురాగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ధరను రూ.4కు తగ్గించేలా చూడాలని సూచించారు. సమర్థ నిర్వహణ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.339 కోట్లు ఆదా చేశామని అధికారులు తెలపగా, పొదుపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.

**ఇంధన రంగం గేమ్ ఛేంజర్**

"ఉమ్మడి రాష్ట్రంలోనే దేశంలో తొలిసారిగా ఎనర్జీ ఆడిటింగ్ వంటి సంస్కరణలు తెచ్చాం. ఇప్పుడు ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తోంది. ఇంధన రంగం భవిష్యత్తులో గేమ్ ఛేంజర్ కానుంది. తక్కువ ఖర్చు, పర్యావరణ హిత విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం కాబట్టే గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి," అని చంద్రబాబు అన్నారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలను ప్రజలకు, రైతులకు మరింత చేరువ చేయాలని సూచించారు. సోలార్ విద్యుత్‌లో దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలపాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**ఎనర్జీ యూనివర్సిటీ, ఇంక్యుబేషన్ ఫండ్**

రాష్ట్రంలో ఇంధన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఒక 'ఎనర్జీ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌లకు ఆర్థిక చేయూతనిచ్చేలా 'ఇంక్యుబేషన్ ఫండ్' ఏర్పాటు చేయాలని సూచించారు. "మన విద్యుత్ సంస్థలు ఇతర రాష్ట్రాలకు కన్సల్టెన్సీ సేవలు అందించే స్థాయికి ఎదగాలి. ఇప్పటికే ట్రూ అప్ భారాన్ని ప్రజలపై వేయలేదు, పైగా 13 పైసల మేర ట్రూడౌన్ చేశాం. కొనుగోలు భారాన్ని కూడా తగ్గిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం

### అన్నాడీఎంకే మేనిఫెస్టో విడుదల

- రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా ఫ్రిజ్‌లు ఇస్తామని హామీ
- మహిళా ఉద్యోగులకు రాయితీతో ద్విచక్ర వాహనాలు అందిస్తామని ప్రకటన
- విద్యా రుణాలు మాఫీ చేస్తామని హామీ

**పెన్ పవర్ డెస్క్:**తాము అధికారంలోకి వస్తే పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఉచితంగా ఫ్రిజ్ ఇస్తామని అన్నాడీఎంకే తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికలు

- మిగతా2లో



## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటు

- బస్తర్‌లో కీలక పరిణామం
- పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు కమాండర్ పాపారావు
- ఆయుధాలతో పాటు 17 మంది అనుచరుల లొంగుబాటు
- బస్తర్‌లో సాయుధ నక్సలిజం అంతమైందన్న ప్రభుత్వం
- ఇక ఇద్దరు అగ్రనేతలు మాత్రమే మిగిలారన్న హోం మంత్రి

**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను నక్సల్ రహితంగా మారుస్తామని ప్రభుత్వం విధించుకున్న గడువుకు వారం రోజుల ముందే ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది.

- మిగతా2లో

## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

- ఉత్తరాంధ్రలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్
- ఈ పరిశ్రమతో ఉక్కు రంగంలో అగ్రస్థానానికి ఏపీ
- ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇది సాధ్యమైందన్న సీఎం చంద్రబాబు
- గతంలో కబ్జాలు, భయం.. నేడు అభివృద్ధి, భవిష్యత్‌పై భరోసా కల్పించామన్న సీఎం
- ఈ ప్లాంట్‌తో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకుస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు,


- మిగతా2లో

## అమరావతిలో అగ్నిప్రమాదాల
# వెనుక కుట్ర?

### రాయపూడి ఘటనపై సీఎం చంద్రబాబు హైలెవల్ రివ్యూ!

- మొన్న రాత్రి రాయపూడిలోని హెచ్‌వోడీ టవర్ల ప్రాంతంలో అగ్నిప్రమాదం
- మేఘా సంస్థకు చెందిన భారీ ప్లాస్టిక్ పైపులు ఆహుతి
- ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మూడు జరిగాయన్న అధికారులు
- ఉద్దేశ పూర్వకంగా చేశారేమో అని అనుమానాలు

- మిగతా2లో





## ఆ సబ్జెక్ట్ గురించి మంత్రి నారా లోకేశ్ గారికి విజ్ఞప్తి చేశాను

- కుప్పం విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్న నారా భువనేశ్వరి
- నాన్న వీధిదీపాల కింద చదివారు, చంద్రబాబు కిలోమీటర్లు నడిచారని వెల్లడి
- పిల్లలకు సెల్ ఫోన్లు అధికంగా ఇవ్వొద్దు, టెక్నాలజీ అవసరానికే వాడాలని సూచన
- అహంభావం వద్దు, తల్లిదండ్రులను గౌరవించాలని విద్యార్థులకు హితవు

**పెన్ పవర్ డెస్క్:**విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పించడం ఎంతో కీలకమని సీఎం చంద్రబాబు అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ అధినేత నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం పైపాల్యం గ్రామంలో మంగళవారం జరిగిన 'విలువల బడి' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో

- మిగతా2లో

## ట్రంప్ ఫోన్ చేశారు.. శాంతి దిశగా చేపట్టే చర్యలకు భారత్ సహకరిస్తుందని చెప్పాను

- పశ్చిమాసియా పరిస్థితులపై చర్చ జరిపినట్లు వెల్లడి
- ఉద్రిక్తతలు తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారత్ మద్దతు ఇస్తుందని ప్రకటన
- హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం ప్రపంచ దేశాలకు అవసరమన్న మోదీ



**పెన్ పవర్ డెస్క్:**హర్మూజ్ జలసంధిని తెరిచి సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచం మొత్తానికి అత్యవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు ఫోన్ చేసి సంభాషించినట్లు వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై ఉపయోగకరమైన రీతిలో తమ మధ్య చర్చ

- మిగతా2లో

## ఇప్ప పువ్వు సారాతో రూ. లక్ష కోట్ల ఆదాయం..
## అసెంబ్లీలో పూర్తి వివరాలు చెబుతా



- ఇప్ప పువ్వు సారా తాగిన వారు 115 ఏళ్లు బతికారన్న అనిరుధ్ రెడ్డి
- ఇప్ప పువ్వు సారాను శాస్త్రీయంగా ఉత్పత్తి చేస్తే రూ. లక్ష కోట్ల రెవెన్యూ వస్తుందన్న ఎమ్మెల్యే
- విదేశాలకు కూడా ఎగుమతి చేయొచ్చని సూచన

**పెన్ పవర్ డెస్క్:**ఇప్ప పువ్వు సారాపై తనకున్న అవగాహనను తక్కువ అంచనా వేయవద్దని, దీనిపై అసెంబ్లీ వేదికగా రేపు పూర్తి వివరాలు వెల్లడిస్తానని కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల ఎమ్మెల్యే

- మిగతా2లో

## ఏపీకి మిట్టల్ స్టీల్ ప్లాంట్ రావడానికి జగనే కారణం

- దావోస్ లో ఆదిత్య మిట్టల్ తో జగన్ చర్చలు జరిపారన్న గుడివాడ
- నక్కపల్లి వద్ద వేల ఎకరాల భూమిని కూడా చూపించామని వెల్లడి
- జగన్ వ్యక్తిత్వాన్ని కించపరచవద్దని షర్మిలకు సూచన

- మిగతా2లో



## ధర్మ రక్షణకు శంకరాచార్యుల 'చతురంగిణి సేన'..
# 2 లక్షల మందితో సైన్యం!

- 2.18 లక్షల మందితో సైన్యం.. కుల, లింగ భేదం లేకుండా అందరికీ ప్రవేశం
- వచ్చే ఫిబ్రవరిలో ప్రయాగ్‌రాజ్‌లో సైన్యాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడి
- శంకరాచార్యుల ప్రకటనపై దృష్టి సారించిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం
- ఆయుధాల ప్రదర్శనపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**జ్యోతిష్పీఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన ప్రకటన చేశారు. హిందూ ధర్మం, గోవుల రక్షణ కోసం 2 లక్షల 18 వేల మంది సైనికులతో 'చతురంగిణి సేన'ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వారణాసిలో ఆయన ఈ ప్రకటన చేశారు. కుల, మత, లింగ భేదాలు లేకుండా ఎవరైనా ఈ సైన్యంలో చేరవచ్చని

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త గోవారికర్

భారత దేశం గర్వించదగిన శాస్త్రవేత్తలలో గోవారికర్ ప్రముఖులు. ఆయన అంతరిక్ష రంగంలో మరిచి పోలేని విశేష పరిశోధనలు చేసారు. భారత దేశంలో సైన్స్, టెక్నాలజీ శాఖ కార్యదర్శిగా,1991-1993 మధ్యకాలంలో అప్పటి భారత ప్రధాని దివంగత పి.వి.నరసింహారావుకు శాస్త్రీయ సలహాదారుగా వ్యవహరించారు. భారత మాన్సూన్ నమూనా పితామహుడిగా పేరు గాంచిన ఆయన తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో వాతావరణ మార్పులను సూచించే వ్యవస్థను రూపొందించిన తొలి శాస్త్రవేత్త. ఆయన ఇస్రో కు ఛీఫ్ గా తన సేవలందించారు. వాతావరణం, జనాభా రంగాలలో కూడా తన సేవలనందించారు. 'పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డుల గ్రహీత. వసంత్ రాంచోండ్ గోవారికర్ (1933 మార్చి 25 – 2015 జనవరి 2) పూణేలో లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో మార్చి 25, 1933 న జన్మించారు. తరువాత ఆయన మహారాష్ట్ర లోని కోల్హాపూర్ జిల్లాలో ప్రారంభ విద్య, గ్రాడ్యుయేషన్ చేసారు.1950ల ప్రారంభంలో పరిశోధనల నిమిత్తం ఇంగ్లాండు వెళ్లారు. ఆయన ఎం.ఎస్.సి, కెమికల్ ఇంజనీరింగ్ లో పి.హెచ్.డి లను డా.ఎఫ్.హెచ్.గార్నర్ అధ్వర్యంలో చేసారు. ఆయన పరిశోధనల ఫలితం "గార్నర్–గోవారికర్ సిద్ధాంతం". ఈ సిద్ధాంతం ఘన పదార్థాల నుండి ప్రవాహులకు ఉష్ణము, ద్రవ్యరాశిల బదిలీ గూర్చి విశ్లేషణ చేయబడిన గ్రంథము. 1959 నుండి 1967 వరకు ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో, ఆయన మొదట హార్వెల్‌లోని (బ్రిటిష్) అటామిక్ ఎనర్జీ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో, తరువాత సమ్మర్ ఫీల్డ్‌లో పనిచేశారు. ఈ సంస్థ రాకెట్ మోటారుల ఉత్పత్తిలో పేరెన్నిక గన్నది. ఆయన ఆక్స్ఫర్డ్ తో పాటు కేంబ్రిడ్జ్ ఎగ్జామినేషన్ బోర్డ్ యొక్క ఎగ్జామినర్స్ బయటి ప్యానెల్ సభ్యుడిగా మరియు పెర్గామోన్ యొక్క బాహ్య సంపాదకీయ సిబ్బందిగా కూడా పని చేశారు. అక్కడ అనేక శాస్త్రీయ పుస్తకాలను సవరించడంలో సహాయం చేశారు. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ సారథ్యంలో, డాక్టర్ గోవారికర్ 1967 లో తిరువనంత పురంలోని తుంబాలోని అంతరిక్ష కేంద్రంలో ప్రొపెల్లెంట్ ఇంజనీర్‌గా చేరారు. తరువాత ఈ కేంద్రం ఇతర అంతరిక్ష పరిశోధన సంస్థలతో కలిసి 1972 లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వి.ఎస్.ఎస్.సి) గొడుగు కిందకు వచ్చింది. డాక్టర్ గోవారికర్ 1973 లో కెమికల్స్ అండ్ మెటీరియల్స్ గ్రూప్ డైరెక్టర్ అయ్యారు, చివరకు 1979 లో సెంటర్ డైరెక్టర్ అయ్యారు. 1985 వరకు ఆ పదవిలో కొనసాగారు.1994 – 2000 మధ్య మరాఠీ విజ్ఞాన్ పరిషత్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. భారత దేశంలో మొట్ట మొదటి ప్రయోగ వాహనం ఎస్ఎల్వి 3, వి.ఎస్.ఎస్.సి డైరెక్టర్ గా ఉన్న కాలంలో విజయ వంతమైన విజయాన్ని సాధించింది. భారత దేశం యొక్క ప్రయోగ వాహనాల కోసం క్లిష్టమైన ఘన ఇంధన సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా స్వదేశీగా... అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చడంలో డాక్టర్ గోవారికర్ వృత్తి పరమైన నాయకత్వాన్ని అందించారు. ఇస్రో సంబంధిత 'సాలిడ్ ప్రొపెల్లెంట్ స్పేస్ బూస్టర్ ప్లాంట్' అయన నాయకత్వంలో 5,500 ఎకరాలకు పైగా భూమిని ఏర్పాటు చేశారు. ఆయన అంతరిక్ష పరిశోధన, వాతావరణ అంచనా, ఇతర అంశాల పై పరిశోధనలు చేశారు. గోవారికర్ యూకే అటామిక్ ఎనర్జీ అథారిటీలో కూడా పనిచేశారు. ఆయన శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఆయన 1995 నుండి 1998 మధ్య పూణే విశ్వ విద్యాలయ ఉపకులపతిగా పనిచేశారు. ఆయన దేశంలోని మొట్టమొదటి రుతుపవనాల సూచన నమూనా వెనుక ఉన్న వ్యక్తి అయినందున 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ మాన్‌సూన్ మోడల్' గా ప్రసిద్ది చెందారు. 1988 నుండి, ప్రభుత్వ వాతావరణ శాస్త్రవేత్తలు ఈ నమూనాను గోవారికర్ పేరు పెట్టారు. చాలా ఖచ్చితమైన రుతుపవనాల అంచనాలను ముందుగానే ఉపయోగిస్తున్నారు. పౌర సరఫరా, పంట పద్ధతులు, చమురు విత్తనాల దిగుమతి రంగాలలో తగిన సర్దుబాట్లు చేయడానికి ప్రణాళిక దారులకు ఈ నమూనా చాలా సహాయకారిగా నిరూపించ బడింది.దేశ ఉపగ్రహ పరిశోధన కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రఖ్యాత శాస్త్రవేత్తల బృందంలో ఎపిజె కలాం, ఇ.వి. చిట్నిస్, ప్రమోద్ కాలే, యు.ఆర్. రావు వంటి వారి బృందంలో గోవారికర్ ఉన్నారు. ఆయనకు భారత దేశంలో ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ 1984 లో, పద్మభూషణ్ 2008 లో వచ్చాయి. ఆయన జనవరి 2 2015 శుక్రవారం నాడు పుణేలోని దీనానాథ్ మంగేష్కర్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు.

# అమరావతిలో అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?

రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం అవుతున్న తరుణంలో, వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. నిన్న రాత్రి రాయపూడిలోని హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ ప్రాంతంలో మేఘా సంస్థకు చెందిన భారీ ప్లాస్టిక్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనపై ఈరోజు సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... ఇది కేవలం ప్రమాదమా లేక ఎవరైనా కావాలని చేస్తున్న కుట్రనా అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.

**సీఎం చంద్రబాబు వ్యక్తం చేసిన ప్రధాన సందేహాలు:**

రాజధాని ప్రాంతంలో గత కొద్ది రోజులుగా మూడు సార్లు ఇలాంటి ప్రమాదాలు జరగడం యాదృచ్ఛికం కాదని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన నిర్మాణ సామగ్రి కాలిపోవడం వెనుక ఏదైనా లోతైన కుట్ర ఉందేమో తేల్చాలని చెప్పారు. వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కూడా గతంలో ఇలాగే పైపులు అగ్నికి ఆహుతయ్యాయని, ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మూడు జరిగాయని, ఇది ఉద్దేశపూర్వక చర్యగా కనిపిస్తోందని అధికారులు ప్రాథమిక సమాచారం అందించారు.

ఈ రోజు సాయంత్రం సీఆర్డీఏ అధికారులు, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాజధాని ప్రాంతంలో సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేసేలా ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**రాయపూడిలో అసలేం జరిగింది?**

అఖిల భారత సర్వీస్ అధికారుల (IAS/IPS) కోసం నిర్మిస్తున్న నివాస సముదాయాల సమీపంలో నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా తగులబడ్డాయి. ఆకాశాన్ని అంటేలా ఎగిసిపడిన మంటలను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది.

# ఏపీకి మిట్టల్ స్టీల్ ప్లాంట్ రావడానికి జగనే కారణం

అనకాపల్లి జిల్లాలో నక్కపల్లికి అర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రావడానికి అసలు కారణం వైసీపీ అధినేత జగన్ అని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దావోస్ పర్యటనలో ఆదిత్య మిట్టల్‌తో జగన్ జరిపిన చర్చల ఫలితంగానే ఈ భారీ ప్రాజెక్టు పట్టాలెక్కిందని గుర్తుచేశారు. ఆదిత్య మిట్టల్ కోరిన విధంగానే నక్కపల్లి వద్ద 4 వేల ఎకరాల భూమిని చూపించామని, ఎన్నికల నోటిఫికేషన్ సమయంలోనే దీనిపై స్పష్టత వచ్చిందని ఆయన వివరించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి కొత్తగా వచ్చిన పరిశ్రమలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. జగన్ హయాంలో వచ్చిన బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం ఇప్పటికీ పూర్తి చేయలేకపోవడంపై ఆయన విమర్శలు గుప్పించారు. 35 వేల మందికి ఉపాధి కల్పించాల్సిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం అయోమయంలో పడిందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గడిచిన కాలంలో సుమారు రూ. 6,500 కోట్ల పెట్టుబడులు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని ఆయన ఆరోపించారు.

ఇదే క్రమంలో వైఎస్ షర్మిల చేస్తున్న ఆరోపణలపై అమర్‌నాథ్ తీవ్రంగా స్పందించారు. "మీ రాజకీయ అవసరాల కోసం జగన్ వ్యక్తిత్వాన్ని కించపరచకండి. ఎవరి చేతిలోనూ రాజకీయ పావుగా మారకండి" అని హితవు పలికారు. షర్మిల వ్యాఖ్యల వల్ల వైసీపీ కార్యకర్తల నుంచి తమపై ఒత్తిడి పెరుగుతోందని, ఇప్పటివరకు జగన్ తమను కట్టడి చేస్తున్నారని చెప్పారు. ఒకవేళ హద్దు మీరితే మాత్రం మిగతా రాజకీయ పార్టీ నాయకులకు ఎలా సమాధానం చెబుతామో, ఆమెకు కూడా అలాగే బదులిస్తామని హెచ్చరించారు.

## ఇప్ప పువ్వు సారాతో రూ. లక్ష కోట్ల ఆదాయం..
# అసెంబ్లీలో పూర్తి వివరాలు చెబుతా

- మొదటి పేజి తరువాయి

అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్ చేసిన ఆయన, తనపై వస్తున్న సోషల్ మీడియా ట్రోల్స్‌కు తన ప్రసంగమే సమాధానం చెబుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం వినోదం కోసం కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మార్చే శక్తి ఇప్ప పువ్వుకు ఉందని అన్నారు.

గతంలో ఇప్ప పువ్వు సారా తాగిన వారు 115 ఏళ్లు ఆరోగ్యంగా బతికారని, కానీ ప్రస్తుతం వస్తున్న కల్తీ బ్రాండ్ల వల్ల ప్రజలు 60 ఏళ్లకే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్ప పువ్వు సారాను శాస్త్రీయంగా ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేస్తే, రాష్ట్రానికి ఏకంగా రూ. లక్ష కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని ఆయన లెక్కలు వేశారు. దీనిని విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా గ్లోబల్ బ్రాండ్‌గా మార్చవచ్చని కూడా సూచించారు. అడవుల్లో ఇప్ప పువ్వు సేకరించే గిరిజన సోదరులు ఆర్థికంగా ఎదగాలంటే, ఇప్ప పువ్వు సారాకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు.రేపు శాసనసభలో ఇప్ప పువ్వు సారా విధానంపై తాను ప్రసంగించబోతున్నానని, ఈ సారా తయారీ వెనుక ఉన్న శాస్త్రీయత, ఆర్థిక లాభాలను గణాంకాలతో సహా వివరిస్తానని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ట్రోల్స్ చేసే వారు తన ప్రసంగం విన్నాక అభిప్రాయం మార్చుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

- మొదటి పేజి తరువాయి

కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## ఆ సబ్జెక్ట్ గురించి మంత్రి నారా లోకేశ్ గారికి విజ్ఞప్తి చేశాను

- మొదటి పేజి తరువాయి

ముచ్చటిస్తూ, తన తండ్రి ఎన్టీఆర్, భర్త చంద్రబాబుల బాల్యంలోని కష్టాలను గుర్తుచేసుకుంటూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఉన్నత స్థానాలకు చేరడానికి వారు పడిన శ్రమను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి మాట్లాడుతూ, "విద్యార్థులను చూస్తే నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. మా చిన్నప్పుడు 'మోరల్ సైన్స్' అనే సబ్జెక్ట్ ఉండేది. కానీ కాలక్రమేణా దాన్ని తీసేశారు. పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని మంత్రి నారా లోకేశ్ గారికి ఇప్పటికే విజ్ఞప్తి చేశాను" అని తెలిపారు. తన తండ్రి ఎన్టీఆర్ గురించి చెబుతూ, "మా నాన్నగారు ఓ పేద కుటుంబంలో పుట్టి, కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. చిన్నప్పుడు సైకిల్‌పై ఇల్లిల్లూ తిరిగి పాలు అమ్మేవారు. వీధిదీపాల కింద కూర్చొని చదువుకున్నారు" అని భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు.అదేవిధంగా, తన భర్త చంద్రబాబు నాయుడు కూడా చిన్నతనంలో కిలోమీటర్ల దూరం నడిచి బడికి వెళ్లేవారని, వారు ఎదిగిన తీరు తనకు గర్వకారణంగా ఉంటుందని పేర్కొన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర అత్యంత కీలకమని, తన తల్లి తమకు విలువలు నేర్పి పెంచిందని వివరించారు.

ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ఆమె కీలక సూచనలు చేశారు. "పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వకూడదు. ఒకే ఇంట్లో ఉండి కూడా కుటుంబ సభ్యులకు ఫోన్లలో మెసేజ్‌లు పంపుకునే పరిస్థితి వచ్చింది. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడుకోవాలి. మా చిన్నతనంలో ఫోన్లు, టీవీలు లేకపోవడం వల్లే సంతోషంగా గడిపామనిపిస్తుంది" అని అన్నారు. 'అన్నీ మాకే తెలుసు' అనే అహంభావం ఎవరికీ ఉండకూడదని, అహంకారం మనల్ని పాతాళానికి నెట్టేస్తుందని హితవు పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవ్వడంతో మనుషుల మధ్య దూరం పెరిగిపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం

- మొదటి పేజి తరువాయి

దగ్గరపడుతున్న నేపథ్యంలో డీఎంకే, టీవీకే పార్టీలు వరుసగా తమ మేనిఫెస్టోలను ప్రకటిస్తున్నాయి. తాజాగా అన్నాడీఎంకే తన ఎన్నికల హామీలను విడుదల చేసింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా ఫ్రిజ్‌లు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపింది. 5 లక్షల మంది మహిళా ఉద్యోగులకు రూ.25 వేల రాయితీతో ద్విచక్ర వాహనాలు అందిస్తామని ప్రకటించింది. బ్యాంకుల నుంచి తీసుకున్న విద్యా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం ఇస్తామని తెలిపింది. రేషన్ కార్డు ఉన్న వారికి బియ్యంతో పాటు ఉచితంగా కిలో పప్పు, కిలో మంచినూనె అందజేస్తామని తన మేనిఫెస్టోలో పేర్కొంది. సంవత్సరానికి ఒక కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, సామాజిక భద్రతా పెన్షన్ రూ.2 వేలకు పెంపు, జల్లికట్టు యోధుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం వంటి హామీలను కూడా పొందుపరిచింది.

## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటు

- మొదటి పేజి తరువాయి

బస్తర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న చివరి అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య అలియాస్ మంగు తన సాయుధ బృందంతో సహా పోలీసులకు లొంగిపోయాడు. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. 56 ఏళ్ల పాపారావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. ఇతను బీజాపూర్ జిల్లాలోని కుట్రు పోలీస్ స్టేషన్‌లో 17 మంది అనుచరులతో (10 మంది పురుషులు, 8 మంది మహిళలు) కలిసి లొంగిపోయాడు. వీరి నుంచి 8 ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పాపారావు తలపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత బస్తర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్‌గా పాపారావు ఉన్నాడు. అతడిపై 50 కేసుల వరకు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ ను కిడ్నాప్ చేసిన ఘటనలోనూ, గతంలో 76 మంది భద్రతా సిబ్బందిని బలిగొన్న ఘటనలోనూ పాపారావు హస్తం ఉందని భావిస్తున్నారు.

ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధృవీకరించారు. పాపారావు లొంగుబాటుతో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఇక క్రియాశీల సభ్యులెవరూ లేరని ఆయన తెలిపారు. లొంగిపోయే ముందు తాను పాపారావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. రాష్ట్రం వెలుపల కేవలం ఇద్దరు అగ్ర నేతలు మిషిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. పాపారావు లొంగుబాటుతో బస్తర్‌లో సాయుధ నక్సలిజం పూర్తిగా అంతమైందని ప్రభుత్వం ప్రకటించింది.అయితే, ఈ పరిణామంపై రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. గడువు ముగిసిన తర్వాత అమాయక ఆదివాసులపై వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని, వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అరెస్టులు చేయవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ హెచ్చరించారు. బస్తర్ సహజ వనరులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రమాదం కూడా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

### ధర్మ రక్షణకు శంకరాచార్యుల 'చతురంగిణి సేన'..
## 2 లక్షల మందితో సైన్యం!

- మొదటి పేజి తరువాయి

ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మౌని అమావాస్య సందర్భంగా ఈ సైన్యాన్ని అధికారికంగా ప్రారంభిస్తామని శంకరాచార్యులు తెలిపారు. మహాభారత కాలం నాటి తరహాలో పదాతి, అశ్వ, గజ, రథ బలాలతో ఈ సైన్యం ఉంటుందని వివరించారు. ఈ సేన సభ్యులకు సాంప్రదాయ, ఆధునిక ఆయుధాలతో శిక్షణ ఇస్తామని చెప్పారు. ధర్మం, సంస్కృతి, సమాజాన్ని కాపాడటమే ఈ సేన ముఖ్య బాధ్యత అని ఆయన అన్నారు. ప్రకటన సమయంలో ఆయన, ఆయన అనుచరులు గొడ్డలి నమూనాలను చేతపట్టుకుని కనిపించారు. ఈ సైన్యంలో చేరేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని శంకరాచార్యులు పునరుద్ఘాటించారు. హిందూ సమాజంలోని అన్ని కులాల వారితో పాటు స్త్రీలు, పురుషులు, తృతీయ లింగానికి చెందిన వారు కూడా ఇందులో భాగం కావచ్చని పిలుపునిచ్చారు. అయితే, శంకరాచార్యుల ప్రకటనపై ఉత్తరప్రదేశ్ యంత్రాంగం దృష్టి సారించింది. లైసెన్సు లేని ఆయుధాలను కలిగి ఉండటం లేదా బహిరంగంగా ప్రదర్శించడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఇటీవల మాఘ మేళా సందర్భంగా తనను సంగమ్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారని శంకరాచార్యులు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను విమర్శించిన విషయం తెలిసిందే. గతంలో ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం కూడా గమనార్హం. మొత్తం మీద, శంకరాచార్యుల ఈ ప్రకటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## ట్రంప్ ఫోన్ చేశారు.. శాంతి దిశగా చేపట్టే చర్యలకు భారత్ సహకరిస్తుందని చెప్పాను

- మొదటి పేజి తరువాయి

జరిగిందని తెలిపారు. ఈ అంశంపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారతదేశం మద్దతు ఇస్తుందని ట్రంప్‌కు చెప్పినట్లు పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, రక్షణ కల్పించడం ప్రపంచ దేశాలకు అత్యవసరమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. శాంతి, సుస్థిరం దిశగా చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ అండగా నిలుస్తుందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు.ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య గత 24 రోజులుగా జరుగుతున్న యుద్ధానికి, ట్రంప్ నిన్న తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పాటు ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తదుపరి చర్చల ఫలితాలను బట్టి నిర్ణయం ఉంటుందని అన్నారు. యుద్ధానికి తాత్కాలికంగా విరామం ప్రకటించిన మరుసటి రోజే ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ కాల్ చేయడం గమనార్హం.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా . ఎన్.టి.ఆర్. జిల్లా . గుంటూరు జిల్లా . పల్నాడు జిల్లా . బాపట్ల జిల్లా

# పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి....ఎమ్మెల్యే గళ్ళా మాధవి...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 24. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అత్యవసర వైద్య అవసరాలు మరియు ఇతర కష్టకాల పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ రోజు ఒక్కరోజే మొత్తం 41 మందికి రూ.32,37,844/- విలువైన చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సహాయం ద్వారా అనేక కుటుంబాలకు ఉపశమనం కలిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందుతోందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 505 మంది లబ్ధిదారులకు రూ.6,77,85,662/- విలువైన సహాయం అందజేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు....

# టిడ్కో గృహ సముదాయాల్లో సమగ్ర మౌలిక వసతుల కల్పన చేసి, నివేదిక ఇవ్వాలి....కమిషనర్ కె.మయూర్ అశోక్...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 24. మంగళవారం వెంగళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయాలు, గోశాల తదితర ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్ లో ఉన్న టిడ్కో గృహసముదాయాలను త్వరలో లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సదరు గృహసముదాయానికి ట్రీట్మెంట్ చేసిన నీటిని అందించాలని, స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుకు సిపిడిసిఎల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. టిడ్కో గృహసముదాయాల్లో చేపట్టిన పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. రోడ్ల వెంబడి మొక్కలు నాటడం, ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయాలన్నారు. సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనితీరుని పరిశీలించి, నిర్దేశిత మార్గదర్శకాల మేరకు ప్లాంట్ పని చేయడం లేదని, సదరు ఏజెన్సీ ప్రతినిధులను పిలిచి మాట్లాడాలన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు తక్షణం పిచ్చి మొక్కలను జేసిబితో శుభ్రం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ప్రతి రోజు చెత్త సేకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అనంతరం జిఎంసి గోశాలని పరిశీలించి, ఎన్ని ఆవులు ఉన్నదీ, విధుల్లో ఉన్న సిబ్బంది,

మౌలిక వసతుల వివరాలను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని, చూడి ఆవులకు ప్రత్యేకంగా షెడ్ ని ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోశాలకు తరలించిన ఆవుల ఆరోగ్య స్థితిని, వాటికి ఆహారం సక్రమంగా అందేలా వెటర్నరీ అసిస్టెంట్ పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో జిఎంసి సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ సి.సుబ్బారాయుడు, డిసిపి సూరజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, విఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఈఈ విష్ణు, డిఈఈ శ్రీనివాస్, బయాలజిస్ట్ శేషయ్య, ఉపా సెల్ పిఓ సింహాచలం, ఎస్ఎస్ రాజేష్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు....

# 29న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం : ప్రత్తిపాటి

## ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నాదెండ్ల మండల కేంద్రంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు.

## వైద్య శిబిరం ప్రచార పత్రాలను ఆవిష్కరించిన ప్రత్తిపాటి.

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 24: చిలకలూరిపేట : కంటి సంబంధిత సమస్యలతో బాధపడే ప్రతి ఒక్కరూ ఈ నెల 29న, ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శంకర కంటి ఆసుపత్రి వారి వైద్య సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు నిచ్చారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఎన్నోఏళ్ల నుంచి నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజా రోగ్య పరిరక్షణే లక్ష్యంగా నాదెండ్ల మండల కేంద్రంలోని పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మండపంలో ఆదివారం నాడు నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని తమకోసమే ఏర్పాటు చేసినట్టు ప్రజలు భావించాలని ఆయన సూచించారు. మంగళవారం ఆయన ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన ప్రచార పత్రాలను ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలతో పాటు, చుట్టుపక్కల నియోజకవర్గాల వారూ ఉచిత కంటి వైద్యశిబిరానికి భారీ సంఖ్యలో తరలి వచ్చి, తమ కంటి సమస్యలకు నాణ్యమైన ఉచిత వైద్యసేవల్ని పొందాలని కోరారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శంకర నేత్రాలయ వైద్య సిబ్బంది ప్రజలకు తమ సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వాహకులు ఉచిత మెగా వైద్యశిబిరానికి సంబంధించి రోగులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్నిఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త



నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కందిమల్ల రఘురామారావు, ఈవూరి బ్రహ్మానందం, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# అమరావతి గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్




అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 24: అమరావతిలో గురుకుల పాఠశాలను ఆకస్మిక తనికి చేసిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజనం నాణ్యతను పరిశీలించినఎమ్మెల్యే.విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న విద్య,ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల అమలు విధానాన్ని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే విద్యార్థుల నడవడికను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలన్న ఎమ్మెల్యే.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించినఎమ్మెల్యే.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంచినేని రాజా మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా నివారణపై వర్క్ షాప్ నిర్వహణపై చర్చ...రాయపాటి శైలజ....

పెన్ పవర్, గుంటూరు, మార్చి, 24. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మానవ అక్రమ రవాణా నియంత్రణపై నిర్వహించే వర్క్ షాప్ నిర్వహణపై చర్చ జరిగింది. ఈ చర్చ మంగళవారం నాడు మహిళా కమిషన్ చైర్ పర్సన్ వారి కార్యాలయంలో చైర్ పర్సన్ రాయపాటి శైలజ, మహిళా కమిషన్ అడ్వైజర్ సూయజ్, విజయవాడ రైల్వే డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ షణ్ముగం వడివేల్ ఎస్ చర్చలో పాల్గొని మానవ అక్రమ రవాణా నివారణ పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో శైలజ మాట్లాడుతూ. ...మానవ అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు.మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన కల్పిస్తూ రైల్వే, స్టేట్ పోలీస్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్స్, విశ్వవిద్యాలయాలలోని యాంటీ



హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్స్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ,స్వచ్ఛంద సేవా సంస్థలు, ఫోరెన్సిక్ డాక్టర్లు, వన్ స్టాప్ సెంటర్స్( సఖి), మానవ అక్రమ రవాణా నివారణకు విశేష కృషి చేసిన రిటైర్డ్ డిజిపి పీఎం నాయర్ ను వర్క్ షాప్ కు ఆహ్వానించి మానవ అక్రమ రవాణా దుష్ప్రభావాలను వివరించి అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పనిచేసేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. మానవ అక్రమ రవాణా నియంత్రణ కోసం పనిచేసే 112 టోల్ ఫ్రీ నెంబర్, శక్తి యాప్ లపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్న అవసరాన్ని గుర్తు చేశారు.....

# ఆర్ ఏం పీ ల సమస్య లు పరిష్కారం చెయ్యండి తెలంగాణ ప్రభుత్వం కు డిమాండ్...కొండిశెట్టి సురేష్ బాబు..

పెన్ పవర్ విజయవాడ, మార్చి, 24. గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ సమావేశం లో పరిష్కారం చేయండి డిమాండ్ గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, డా కొండి శెట్టి సురేష్ బాబు ప్రధాన కార్యదర్శి నర్రా సునీత గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వైద్యులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వాల నుంచి తగిన గుర్తింపు, రక్షణ, సంక్షేమం అందడం లేదని ఆవేదన తొ గ్రామీణ వైద్యుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి

వైద్యుల ప్రధాన డిమాండ్లు

గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను తక్షణం అరికట్టాలి.

ఆపి వేసిన పారామెడికల్ శిక్షణను




వెంటనే పునః ప్రారంభించాలి.

గ్రామీణ వైద్యులకు ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలి.

జీవో 429 ను పూర్తి స్థాయిలో అమలు చేయాలి.

ప్రభుత్వ జీవనోపాధి పాలసీని అమలు చేయాలి. అని జంతర్ మంతర్ డిల్లీ నందు నిరసన తెలియ చేసి జంతర్ మంతర్ అధికారుల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు వినతి గ్రామీణ వైద్యుల సమస్య లు పరిష్కారం చెయ్యండి గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డా కొండి శెట్టి సురేష్ బాబు 9885395466 ప్రధాన కార్యదర్శి నర్రా సునీత జే ఏ సి రాష్ట్ర నాయకులు . రవీంద్ర యాదవ్. ఎన్ శ్రీనివాస్ సయ్యద్ జాఫర్ సందీప్ స్ సునీత సూరి బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది...

# పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి...ఎమ్మెల్యే గద్దె రామోహన్.

పెన్ పవర్, విజయవాడ, మార్చి, 24. సౌరశక్తి వినియోగంపై ప్రజలల్లో అవగాహన పెంపొందిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపేందుకు పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహనకు సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ), నెడ్ క్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో సూర్యాంధ్ర ప్రగతి రథాలను విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం అశోక్ నగర్ లోని తన క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేకమైన కార్యక్రమం 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అని, ప్రతి ఇంటి పైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే అతి తక్కువ ఖర్చుతో మనం ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. మనకు అయ్యే ఖర్చు సుమారు 4 నుండి 6 ఏళ్లలో కరెంట్ బిల్లుల ఆదా ద్వారా తిరిగి వచ్చేస్తుందన్నారు. అనంతరం 20 ఏళ్ల పాటు మనం ఉచితంగా విద్యుత్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ రోజున ఏ ఇంటికి వెళ్లినా కరెంట్ బిల్లు ప్రధానమైన భారంగా మారుతోందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలుకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. ప్రకృతి నుంచి,



సూర్యుడి నుంచి శక్తిని గ్రహించి సోలార్ ప్లేట్ల ద్వారా ఎనర్జీని ఇచ్చే గొప్ప కార్యక్రమం ఇది అని అన్నారు. దీనివల్ల కాలుష్యం కూడా ఉండదన్నారు. విద్యుత్ ప్లాంట్ల వల్ల బొగ్గు పొగ వల్ల వచ్చే కాలుష్యం మన ఊపిరితిత్తులపై ఎంత ప్రభావం చూపుతుందో మనం ఆలోచించుకోవాలన్నారు. ఈ పథకంలో క్రింద ప్రభుత్వం పలు సబ్సిడీలను అందిస్తోందన్నారు. ?70 వేల నుండి ?80 వేల వరకు ఖర్చయ్యే ప్లాంట్‌పై ?30,000 సబ్సిడీ ఉంటుందన్నారు. షెడ్యూల్ కులాలు తెగల వర్గాలకు నూరు శాతం సబ్సిడీ ఇస్తున్నారన్నారు. వారికి ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. బీసీలతో పాటు అందరికీ ఇందులో సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. వ్యక్తిగతంగా లబ్ది పొందా...ప్రజా ప్రతినిధిగా నా అనుభవం.. తన వ్యక్తిగత అనుభవానికి వస్తె తనకు గతంలో నెలకు వేల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లించేవాడినని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నాక ఇప్పుడు ?4,000 నుండి ?5,000 వరకు బిల్లు తగ్గిందన్నారు. ఇందుకు సుమారు ?6 లక్షలు వరకు ఖర్చు చేశానన్నారు. దీనివల్ల నెలకు ?18,000 చొప్పున ఏడాదికి లక్షకు పైగా ఆదా అవుతోందన్నారు. ఇలా మూడు నుండి నాలుగు సంవత్సరాలలో నేను పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేస్తుందన్నారు. నేను వ్యక్తిగతంగా లబ్ధి పొందాను కాబట్టి, ఒక శాసనసభ్యునిగా, ప్రజా ప్రతినిధిగా అందరూ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఎన్ఎస్ఈఎఫ్ఐ సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక మాట్లాడుతూ... సూర్యాంధ్ర ప్రచార ప్రగతి రథాల ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సీహెచ్ ఉదయ్, నెడ్ కాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ మౌలాలి పాల్గొన్నారు.

# పాస్టర్లకు ఇంటిస్థలాల అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తాను : ప్రత్తిపాటి

**కూటమిప్రభుత్వం పాస్టర్లకు రూ.5వేల గౌరవ వేతనం అందిస్తోంది.**
**క్రైస్తవ సమాజ హితానికి, క్రైస్తవుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది.**
**ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితాశయంలో పాస్టర్లు భాగస్వాములు కావాలి.**
**పేదరికం లేని సమాజ నిర్మాణానికి తమవంతు సహాయసహకారాలు అందించాలి.**
**ఆంధ్రప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ వార్షిక సర్వసభ్య సమావేశంలో మాజీమంత్రి ప్రత్తిపాటి.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 24: చిలకలూరిపేట : కూటమిప్రభుత్వం క్రైస్తవ సమాజ హితానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, క్రైస్తవుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోందని, పాస్టర్ల సంక్షేమానికి కట్టుబడి ఉందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని దివ్యశాంతి నిలయంలో ప్రముఖ దైవజనులు నందమూరి క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ వార్షిక సర్వసభ్య సమావేశం -2026కు ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితాశయం అయిన పేదరికం లేని సమాజ నిర్మాణంలో క్రైస్తవ మతబోధకులు భాగస్వాములు కావాలని ప్రత్తిపాటి సూచించారు. పాస్టర్లకు ప్రభుత్వం ప్రతినెలా రూ.5వేల గౌరవ వేతనం అందిస్తోందని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రభువు సేవలో తరించే ప్రతి ఒక్కరూ ఈ ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

నియోజకవర్గంలోని పాస్టర్లకు ఇంటిస్థలాలు అందచేయడంపై ప్రభుత్వంతో చర్చిస్తాను

పాస్లర్లు ఎప్పటినుంచో ఇళ్లస్థలాలు కావాలని కోరుతున్నారని, నియోజకవర్గంలోని పాస్టర్ల తరపున సమస్యపై ప్రభుత్వంతో చర్చించి, దీనికి పరిష్కారమార్గం చూస్తానని ఈ సందర్భంగా ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఇంటి స్థలం లేని పేదలకుఉచితంగా ఇళ్లపట్టాలు ఇవ్వడానికి సిద్ధమైందని, అదే జాబితాలో పాస్టర్లకు కూడా ఇళ్లస్థలాలు అందించేందుకు కృషి చేస్తామని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభువు బోధనలు, ఆయన సూచించిన శాంతి,



ప్రేమ మార్గాన్ని ప్రతి క్రైస్తవుడు/క్రైస్తవురాలు తప్పకుండా ఆచరించాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర నాయకులు ఇనగంటి జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, జాకోబు రాజు, టీడీపీ నాయకులు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలతోనే అధిక ఆదాయం : ప్రత్తిపాటి

**ఏడాదికి రూ. 2 నుంచి రూ.3లక్షల ఆదాయం వచ్చే డిమాండ్ ఉన్న పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి.**
**ఉద్యాన పంటలకు అధిక రాయితీలు, ప్రోత్సాహకాలు లభిస్తాయి.**
**నాయకుల కష్టాన్ని గుర్తించకపోతే, ప్రజలకు మరోసారి కష్టానష్టాలు, రాష్ట్రానికి దుర్దినాలు.**
**వేలూరు, సందెపూడిలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి.**
**స్థానిక నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో రూ. 60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీహాళ్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.**





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 24: చిలకలూరిపేట: ప్రతి ఎకరాకు అధిక దిగుబడి. ప్రతి రైతుకు మంచి లాభం రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయానికి, పాడిపోషణకు ప్రభుత్వాలు అందించే రాయితీలను రైతాంగం సద్వినియోగం చేసుకొని, తమ జీవనప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.

రైతన్నా మీకోసం -- అన్నదాతా సుఖీభవ కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట మండలం వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి గ్రామాల్లో వ్యవసాయవిభాగం నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రత్తిపాటి పాల్గొన్నారు. వేలూరులో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, సందెపూడిలో రూ30 లక్షలతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం (కమ్యూనిటీ హాల్), రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైన్లకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రెండు గ్రామాల్లోనూ పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వవిధివిధానాలు, నూతనసాగు పద్ధతులను ప్రత్తిపాటి అన్నదాతలకు అర్థమయ్యేలా వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన గ్రామసభల్లో మాట్లాడారు.

ఎకరాకు రూ. 2 నుంచి రూ.3 లక్షల ఆదాయమొచ్చేపంటలే సాగు చేయండి.

ఎకరాకు రూ. 4 నుంచి రూ.5 లక్షల ఆదాయం వచ్చే ఉద్యాన పంటల సాగుకు రైతులు ఈ ఏడాదే సిద్ధం కావాలన్నారు. ఏడాదికి రూ. 4, లేదా రూ.5 లక్షల ఆదాయం వస్తే.. దానిలో ఖర్చులు రూ.2లక్షలు పోయినా, రైతుకు రూ. 2 లేదా 3 లక్షలు తప్పకుండా మిగులుతాయన్నారు. 90శాతం సబ్సిడీపై ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వాలు అందించే అన్నిరకాల రాయితీలను రైతులు వినియోగించుకొని, తమ జీవితాలు మార్చుకోవాలన్నారు. పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు.

డిమాండ్ అధికంగా ఉండి, ఎక్కువ దిగుబడినిచ్చే పంటలసాగువైపు రైతులు మళ్లడానికి ఇదే సరైన సమయమని ప్రత్తిపాటి సూచించారు. సేంద్రీయ పద్ధతిలో పండించే కూరగాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కాలానుగుణంగా రైతులు పంటలు మార్చాలని, అలానే తమ ఆలోచనలు, సాగు విధానాలు కూడా మార్చుకోవాలని ప్రత్తిపాటి రైతులకు సూచించారు.

అర్హులైన వారు ఉచిత ఇళ్లస్థలాలకు ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలి...

టీడీపీ మేనిఫెస్టో హామీ ప్రకారం త్వరలోనే ఇళ్లస్థలాలు లేని పేద, మధ్యతరగతి వర్గాలకు పల్లెల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఉచిత స్థలాలు అందచేయనున్నట్లు ప్రత్తిపాటి చెప్పారు. ఇంటిపట్టాలు పొందాలంటే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరూ ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రతి ఒక్కరూ సచివాలయాన్ని సంప్రదించి, నిర్దేశించిన అర్హతల ప్రకారం ఉచిత ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాయకుల కష్టాన్ని గుర్తించకపోతే, ప్రజలకు మరోసారి కష్టనష్టాలే

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ప్రజలు వాటిపై విస్తృతమైన చర్చ చేపట్టాలని, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేవారి ఆలోచనావిధానం మార్చాలని ప్రత్తిపాటి సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ల కష్టాన్ని గుర్తించకపోతే, మరోసారి ప్రజలు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, రాష్ట్రానికి దుర్దినాలు దాపురిస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. స్థానిక నాయకులపై అసూయ, ద్వేషంతో గ్రామాల్ని అభివృద్ధికి దూరం చేయవద్దని ప్రత్తిపాటి ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. మూడుపార్టీల నాయకులు కూడా తమచర్యలతో ప్రజలకు, పార్టీలకు మంచి జరిగేలా వ్యవహరించాలన్నారు. వేలూరు-గణపవరం బ్రిడ్జి నిర్మాణ పనుల్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, రైతు అధ్యక్షులు అంబటి సోంబాబు, మద్దినేని సుబ్బారావు, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు, ముద్దన నాగేశ్వరరావు, మద్దినేనీ శివరామ కృష్ణ, కట్టా వేణు, కొండ్రగుంట శ్రీను, దాసు, ప్రభుదాసు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు, ఎమ్మార్వో, ఎంపీడీవోలు అధికారులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ చేయడంపై పులిగుజ్జు మహేష్ ఆగ్రహం



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 24: చిలకలూరిపేట: ప్రభుత్వాల నుంచి లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ వైద్యులు, నిబంధనలకు విరుద్ధంగా సొంతంగా ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహించడం ఏమిటని పల్నాడు జిల్లా భారతీయ యువ మోర్చా అధ్యక్షులు పులిగుజ్జు మహేష్ ప్రశ్నించారు. మంగళవారం చిలకలూరిపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని రోగుల సౌకర్యార్థం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు 30 పడకల నుండి 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారని ఆయన గుర్తు చేశారు. అయితే, ఇంతటి వసతులు ఉన్నప్పటికీ, విధుల్లో ఉండాల్సిన వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులు ఓపీ సేవల కోసం గంటల తరబడి వేచి చూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వైద్యుల అశ్రద్ధ వల్ల నిరుపేద రోగులకు అన్యాయం జరుగుతోందని, ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలు అతిక్రమించి ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్న సంబంధిత ప్రభుత్వ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పులిగుజ్జు మహేష్ కోరారు.

# చిలకలూరిపేట మున్సిపల్ మార్కెట్ల బహిరంగ వేలం విజయవంతం

## సంద్రి మార్కెట్ వేలం ఈనెల 25కి వాయిదా

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 24: చిలకలూరిపేట : పట్టణ పురపాలక సంఘం పరిధిలోని వివిధ మార్కెట్ల నిర్వహణ హక్కుల కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు పర్యవేక్షణలో ఆయన ఛాంబర్‌లో జరిగిన ఈ వేలంలో రెవెన్యూ ఆఫీసర్ సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరి పాల్గొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మున్సిపాలిటీకి అధిక ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. మాంసం, చేపల మార్కెట్ నిర్వహణ హక్కుల కోసం వ్యాపారులు పోటీ పడగా, గత ఏడాది (2025-26) 1,76,500 ఆదాయం వచ్చిన ఈ మార్కెట్‌కు ప్రస్తుత ఏడాది (2026-27) 1,81,000కు వేలం పాట కుదిరింది. దీని ద్వారా మున్సిపాలిటీకి ?4,500 అదనపు ఆదాయం సమకూరింది. పట్టణంలోని ప్రధాన చంద్రమౌళి కూరగాయల మార్కెట్



వేలం కూడా విజయవంతంగా పూర్తైంది. గత ఏడాది 12,20,000 ఆదాయం వచ్చిన ఈ మార్కెట్‌కు ఈసారి 12,40,000కు వేలం కుదిరి, ?20,000 అధిక ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఇక అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంద్రి మార్కెట్ వేలం మాత్రం అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. 2026-27 సంవత్సరానికి సంబంధించిన ఈ వేలాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గత ఏడాది ఈ మార్కెట్ ద్వారా 16,30,000 ఆదాయం వచ్చిన నేపథ్యంలో, వచ్చే వేలంలో మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# పెదపులివర్రులో 'అన్నదాత సుఖీభవ --ఇంటింటికి ప్రచారం'

భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 24: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ --ఇంటింటికి ప్రచారం' కార్యక్రమం మంగళవారం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద బాబు గ్రామంలో ఇంటింటికి వెళ్లి రైతులను కలుసుకుని అన్నదాత సుఖీభవ పథకం గురించి అవగాహన కల్పించారు. కరపత్రాలను ఇంటి ఇంటికి అందజేసి ఈ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సాయం, అర్హతలు మరియు ప్రయోజనాల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడం లక్ష్యంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ 20,000 లు ఆర్థిక సాయం



అందిస్తున్నదని తెలిపారు. ఈ పథకంలో భాగంగా మొదటి విడతగా రూ 7, 000లు, రెండో విడతగా రూ 7, 000లు, మూడో విడతగా ?6,000 మొత్తం రూ 20,000 లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం లాగా కాకుండా ఇచ్చిన హామీ ప్రకారం రూ 20,000 లు అందజేసింది కూటమి ప్రభుత్వం అన్నారు.అలాగే ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల లోపు రైతు ల ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, నాయకులు వాకా శేషుబాబు, వేములపల్లి జగన్నాథరావు, నూతక్కి దినకర్ బాబు, ఏడుకొండలు, బుర్ర గాంధీ,మండల మరియు గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసులు పై పోలీస్ అధికారుల వెంటనే సంధించాలి... ఎస్సీకార్పొరేషన్ చైర్మన్ కె. ఎస్. జవహర్...

పెన్ పవర్,విజయవాడ, మార్చి, 24. అసమానతలు, కుల వివక్షరహిత సమాజమే లక్ష్యంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ పనిచేస్తుందని అట్రాసిటీ కేసుల పరిష్కారం దిశగా అధికారులు అడుగులు వేయాలని జిల్లా అధికారులకుసూచించడం జరిగిందని రాష్ట్ర ఎస్ సి కమీషన్ చైర్మన్ కె ఎస్ జవహర్ తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టేట్ లో ఎస్సీ అట్రాసిటీ కేసులు సమస్యల పరిష్కారం పై ఎస్ సి కమీషన్ చైర్మన్ మంగళవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ లతో వివిధ అంశాలపైన అపరిష్కృతంగా ఉన్న సమస్యలపైన చర్చించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో కె ఎస్ జవహర్ మాట్లాడుతూ జిల్లాలో23 ప్రభుత్వ శాఖలకు సంబంధించి వెల్ఫేర్ స్కీమ్స్ వాటి అమలు తీరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ కు సంబంధించిన అంశాలపై సమీక్ష చేశామన్నారు. జిల్లాలో ఎస్ సి ఉద్యోగాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు పై పూర్తి స్థాయిలో చర్చించినట్లు తెలిపారు. పోలీస్, రెవిన్యూ డిపార్ట్మెంట్ల లో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు చేశామని పేర్కొన్నారు. తమ దృష్టికి వచ్చిన గణాంకాల ప్రకారం జిల్లాలో 51 అట్రాసిటీ కేసులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ల్యాండ్ కు సంబంధించి 33, సర్వీస్ మేటర్ 29, జనరల్ 45 కేసులు పెండింగ్ లో ఉన్నాయన్నారు.ల విజయవాడ డివిజన్లోనే దాదాపు 27 అట్రాసిటీ కేసులు పెండింగ్ లో ఉన్నాయని వీటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. అట్టడుగు వర్గాలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న అంబేద్కర్ ఆలోచనలే శిరోధార్యంగా పనిచేస్తున్నామన్నారు. లబ్ధిదారుల్ని ఆదుకునే విధంగా చర్యలు తీసుకోమని అధికారులకు చెప్పామన్నారు. అట్టడుగు వర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.అధికారులు ఎస్ సి సమస్యలు పరిష్కరించి సమాజంలో గౌరవం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదిశగా అడుగులు వేయాలని సూచించారు.మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు అన్న సుప్రీంకోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. భారత దేశంలోనే అత్యంత ప్రాముఖ్యమైన అంశంగా మతం ఎప్పటినుంచో ఉందన్నారు. ఎవరైనా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిందేనన్నారు. మతం అనేది వివాదం చేయకుండా ఆలోచిస్తే ఎవరికి ఇష్టం వచ్చిన మతం వాళ్ళు ఎంచుకుంటారన్నారు. రిజర్వేషన్ కి మతాన్ని ముడిపెట్టిన సందర్భంలో సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్ లైన్స్ ను అందరూ ఆమోదించాలన్నారు. రాజకీయాలను, రిజర్వేషన్లను మతం నుంచి విడదీయలేము హిందూ, ముస్లిం,






క్రిస్టియన్ అనేది ఆరాధన క్రమంలో వారు అనుసరించే విధానంలో ఉంటుందని,బాప్టిజం తీసుకొని చర్చికి వెళ్లడం, చర్చి మెంబర్ అయితేనే క్రిస్టియన్ గా గుర్తించాలని రాజ్యాంగం చెప్పిందని గుర్తు చేశారు.అలా కాకుండా లోపల ఏ దేవుడికి దండం పెట్టుకున్నారో మనకు ఎలా తెలుస్తుందన్నారు. కొన్ని ప్రాంతంలో ఎస్సీలకు గడ్డాలు, మీసాలు కూడా చేయడం లేదని,ఆ తరహా వివక్ష వివాదాలు అధికారుల దృష్టికి వచ్చినప్పుడు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయి వరకు వెళ్లడం లేదన్నారు. సామాన్యుడికి కులపరమైన ఇబ్బందులు వస్తే ఖచ్చితంగా వారికి రక్షణగా ఉంటామన్నారు. భారతదేశంలో ఎన్నో చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. అట్రాసిటీ చట్టం కూడా కొన్ని సందర్భాలలో దుర్వినియోగం చేసే వాళ్లకు కూడా మేము కౌన్సిలింగ్ చేస్తున్నామన్నారు. అవతల వైపు బాధితులు న్యాయపరంగా ఉంటే వారికి రక్షణ కల్పిస్తామన్నారు. ఈ చట్టాన్ని స్వార్ధానికి వినియోగిస్తే, నిజంగా అవసరం ఉన్నోళ్లు కూడా దీన్ని వాడుకోలేరనే నిజాన్ని దళిత సోదరులు గుర్తించాలన్నారు. దయచేసి ఎవరు అలా చట్టాలకు విరుద్దంగా అక్రమంగా కేసులు పెట్టవద్దని కోరుతున్నామని వివరించారు.

# జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం.. జిల్లా ఇన్చార్జ్ మంత్రి పార్థసారథి









పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 24: అభివృద్ధిలోనూ, అన్ని రంగాలలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులంతా కలిసి కృషి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. బాపట్ల జిల్లాలో ప్రజల తలసరి ఆదాయం బాగా పెరగడం, వ్యవసాయ ఉత్పత్తుల వృద్ధి రేటు మరింత మెరుగుపడిందని మంత్రి తెలిపారు. జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం 18.75 శాతం పెరిగేలా కలెక్టర్ చొరవ తీసుకోవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎన్నడూ లేని విధంగా జిల్లాలో 58 వేల ఎకరాలు అదనంగా సాగు చేయడం సంతోషదాయకమన్నారు. ?రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్దేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, సాగు, ఉత్పత్తులు పెంచడానికి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మామిడి పంటకు కవర్ తొడగడం ద్వారా కలిగే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు. మే నెల 15 న సాగునీరు విడుదల చేస్తామని సీఎం ప్రకటించారని, పంటల సాగుకు రైతులను సిద్ధం చేయాలని సూచించారు. పంట కాల్వల మరమ్మతు, నిర్వహణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 600 పనులు గుర్తించి, రూ.13 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయకట్టులో ప్రతి చివరి భూమికి నీరు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికతో పనిచేస్తుందన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. వేసవిలో పనిచేయకుండా సాగర్ నీరు విడుదల చేసే సమయంలో పనులు చేస్తే సహించబోమన్నారు. ముందస్తుగా సాగునీటి కాల్వల మరమ్మతు పనులు చేయాలని సూచించారు. పామాయిల్ పంట ప్రస్తుతం లాభసాటిగా ఉన్నందున, జిల్లాలో సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఆ ప్రాంతాలలో పామాయిల్ పంట సాగు చేయడానికి రైతులను ప్రోత్సహించాలన్నారు. జొన్న, మొక్కజొన్న పంటల సాగు విస్తీర్ణం పెరిగినందున కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర వచ్చేలా చూడాలన్నారు.

రెవిన్యూ సమస్యలన్ని పరిష్కరించాలి, ముఖ్యంగా 22 ఏ నిషేధిత భూముల జాబితాలో నుంచి పట్టా భూములను తొలగించాలని మంత్రి సూచించారు. తీర ప్రాంతాలను అనుసంధానిస్తూ జాతీయ రహదారులను నిర్మించడం ద్వారా అభివృద్ధిలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం పొందనుందన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించాలని, బ్రిడ్జిల వద్ద జరిగే ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో సాగునీటి, పంట కాల్వలకు ఎన్ఓసి తీసుకోవాలని, స్థానిక ప్రజల సమస్యలు పరిగణనలోకి తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. 19 గ్రామాలలో నీటి వనరులు సరిగా లేదని గుర్తించామని, ఆ గ్రామాలలోని చేతి పంపులన్ని పది రోజుల్లో మరమ్మతులు చేయాలన్నారు. మంచినీటి పథకాలు బాగా పనిచేసేలా చూడాలి, పైప్ లైన్ ద్వారా చివరి ప్రాంతాలలోని గృహాలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం పథకంలో అర్హులైన విద్యార్థులందరికీ నగదు అందేలా చూడాలన్నారు. అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు.

పర్యాటక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మంత్రి తెలిపారు. వర్షాకాలం లోపుగా స్వదేశీ దర్శన్ సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. పర్యాటక రంగానికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కేవలం పర్యాటక రంగంపైనే కొన్ని రాష్ట్రాలు మనుగడ సాగిస్తున్నాయని, వాటిని మార్గదర్శకంగా తీసుకుని అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ముందస్తు ఆలోచన, ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారులు, బీచ్ ల అభివృద్ధితో పర్యాటక రంగం మరింత అభివృద్ధిలోకి వస్తుందనే విషయాలను గుర్తుంచుకోవాలన్నారు. అటవీ భూముల్లో చెట్లు తొలగించకుండానే కేవలం తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణంలో అభ్యంతరాలు, ఆటంకాలను సున్నితంగా తొలగించుకునేలా ప్రణాళికతో పనిచేయాలన్నారు. పరిశ్రమల స్థాపనలో సీఎం చంద్రబాబు, ఐటి మంత్రి నారా లోకేష్ లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పంచాయితీల అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలన్నారు.

ఎం ఎస్ ఎం పార్కుల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని, ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ లు, తదితర పరిశ్రమల స్థాపనకు మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ లక్ష్యాలు చేరుకోవడానికి డ్వామా, పి ఆర్ అధికారులు రాత్రి, పగలు పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

గోవా మాదిరిగా బాపట్ల జిల్లాను పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నిజాంపట్నం కోర్టు, షిప్పింగ్ హార్బర్ లు త్వరగా నిర్మిస్తే జిల్లాలో మత్స్యకారుల సమస్య తీరుతుందన్నారు. జెట్టిల సమస్య, జల సంధి వద్ద ఏర్పడిన సమస్యలన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు. వీటిపై ఆరో తేదీలోగా డిపిఆర్ తయారుచేసి నివేదిక ఇవ్వాలన్నారు. పర్యాటక రంగానికి తలమానికగా ఉండే స్వదేశీ దర్శన్ ప్రాజెక్ట్ ను రూ.97.52 కోట్లతో నిర్మిస్తుంటే ఉప్పు నీళ్లు వినియోగిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తక్షణమే పరిశీలించి సరి చేయాలని, లేకుంటే పర్యవేక్షణ అధికారి ఎక్కడికి వెళ్లినా చర్యలు తప్పవని, సదరు గుత్తేదారుడ్ని రెడ్ మార్కులో పెడతామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. బీచ్ అభివృద్ధిలో భాగంగా అటవీశాఖ భూమిలో వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. మొక్కలు, చెట్లు లేని ఖాళీ భూమిని మాత్రమే అభివృద్ధికి కేటాయించాలన్నారు. ఆ భూమిలో తాగునీటి పైపులైను ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతించకపోవడం ఏమిటన్నారు. అభివృద్ధికి ఆటంకాలు పెట్టొద్దు అధికారులు అంతా సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

మొంథా తుపాన్ సమయంలో బాపట్ల జిల్లాలో అధిక నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్, అధికారులు బాగా పనిచేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశంసించారు. జల జీవన్ మిషన్ పనులు వేగంగా చేపట్టాలన్నారు. రూ.117 కోట్ల నిధులు కేటాయింపుకు అసెంబ్లీలో తీర్మానం జరిగిందన్నారు. త్వరలో నిధులు వస్తాయని, పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. టోల్ ప్లాజాల వద్ద నిర్వహణ సక్రమంగా లేదని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి అధికారుల తోడ్పాటు, సహకారం ఉండాలని సూచించారు.

సమగ్ర ప్రణాళికతో పనిచేయడం ద్వారా జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. దీంతో 13వ స్థానంలో ఉన్న బాపట్ల జిల్లా ఎనిమిదవ స్థానానికి చేరిందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతులకు సకాలంలో అందించడం, నిరంతరం పర్యవేక్షణ, సూచనలతో వ్యవసాయ రంగం అభివృద్ధిలోకి వచ్చిందన్నారు. అదనంగా 58 వేల ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. తద్వారా పంటల దిగుబడి, ఆదాయ వనరులు పెరిగాయని వివరించారు. వ్యవసాయంలో వృద్ధిరేటు 18.75శాతం నమోదయ్యిందన్నారు. 20 మండలాలుగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో తొలి సమావేశం జరుగుతుందన్నారు.

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లు లేక లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆ రహదారి నిర్మాణంలో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలన్నారు. మన జిల్లాలోని జాతీయ రహదారులపై 20 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, రాష్ట్రీయ రహదారులపై మరొక 79 బ్లాక్ స్పాట్స్ గుర్తించామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు "శిరోరక్ష-ప్రాణ రక్ష" కార్యక్రమాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ఎం ఎస్ ఎం ఈ పార్కుల నిర్మాణం పనులు మొదలయ్యాయని కలెక్టర్ చెప్పారు. 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగించే ప్రక్రియ ప్రారంభించాం, వారానికి 100 చొప్పున రెండు వారాల్లో పరిష్కరించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. వాడరేవు షిప్పింగ్ హార్బర్ పనులు డీపీఆర్ దశలో ఉందన్నారు. స్వదేశీ దర్శన్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరలో ముగియనున్నాయన్నారు.

నిజాంపట్నం, వాడరేవు షిప్పింగ్ హార్బర్ పనులు వేగంగా పూర్తి చేయాలని శాసన మండలి సభ్యులు తూమాటి మాధవరావు అన్నారు. త్వరగా పూర్తయితే మత్స్యకారులు, పర్యాటక రంగానికి తలమానికగా ఉంటుందన్నారు. ఎగుమతులు, దిగుమతులు పెరుగుతాయని, వాణిజ్య రంగం అభివృద్ధిలోకి వస్తుందన్నారు. బీచ్ ల వద్ద రిసార్ట్స్ లలో గదులు దొరకక పోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో బీచ్ ల వద్ద గదులు నిర్మించడానికి అవసరమైన భూమి స్థానికులకు కేటాయించే అవకాశం పరిశీలించాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని అర్హులైన ప్రతి విద్యార్థికి అందించేలా చూడాలన్నారు.

పామ్ ఆయిల్ పంట ఎంతో లాభసాటిగా ఉందని, ఏ ప్రాంతంలో అధిక దిగుబడి వస్తుందో పరిశీలించి రైతులను ప్రోత్సహించాలని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని, విక్రయించుకోవడానికి మంచి అవకాశాలు ఉన్న విషయాలను రైతులకు తెలియజేయాలన్నారు.

రైతుల వద్ద మిగిలి ఉన్న 25 మిలియన్ కిలోల బర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు తెలిపారు. కడవకుదురు, కోలలపూడి గ్రామాలలో మామిడి, పామాయిల్ పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. పామాయిల్ పంట సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులలో అవగాహన కల్పించాలన్నారు.

కృష్ణా నది వరదలలో దెబ్బతిన్న కుటుంబాలకు నష్టపరిహారం రాలేదని, త్వరగా ఇప్పించాలని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మంత్రిని కోరారు. జంపని షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఎం.ఎస్.ఎం.ఇ. పార్కు నిర్మించి ఔత్సాహికులు కేటాయించాలని సూచించారు.

బాపట్ల మండలం అప్పికట్ల బత్తిపూడి గ్రామంలో గృహాలకు 25 సంవత్సరాలుగా తాగునీరు సక్రమంగా అందడం లేదని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. సాగు నీరు విడుదలకు ముందే సామూహిక ఎలుకల నివారణ మందు రైతులకు పంపిణీ చేయాలన్నారు. మురుగుంటపాడు, స్టూవార్టుపురం గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి జరగనున్న నేపథ్యంలో భవిష్యత్తులో వాహనాల పార్కింగ్ సమస్య రాకుండా పార్కింగ్ స్థలం గుర్తించాలని కోరారు. ప్రతిరోజు మూడు వేల మంది, ప్రతి ఆదివారం 25 వేల మంది, కార్తీక మాసం వంటి పండుగ రోజులలో ఒక లక్ష 20 వేల మంది పర్యాటకులు వస్తుంటారని చెప్పారు. స్వదేశీ దర్శన్ లో కేవలం రెండు ఎకరాలను మాత్రమే కేటాయించారని, ప్రజలు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని కనీసం ఎనిమిది ఎకరాలు కేటాయించాలని సూచించారు. బహుళ అంతస్తులు హోటల్స్, రిసార్ట్స్ పెరిగి భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, అన్నిశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం.. ప్రజాక్షేత్రంలో.. మన ఎమ్మెల్యే

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం - ఎమ్మెల్యే

## జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా తో కలిసి ఎమ్మెల్యే అరవింద బాబు పర్యటన





నరసరావుపేట పెన్ పవర్ మార్చి 24: నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ, నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ వారి సమస్యలను తీరుస్తున్న జననేత, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి తన సేవా నిరతిని చాటుకున్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా తో కలిసి మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఏసీ గదులకే పరిమితం కాకుండా, ఎండనక వాననక గడప గడపకూ తిరుగుతూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుంటున్న ఎమ్మెల్యేగా అరవింద బాబు గుర్తింపు పొందారు. 5, 6, 7 వార్డులకు చెందిన కాలనీలో పర్యటించి, అక్కడ నివసిస్తున్న సుమారు 360 ఇళ్ల ప్రజలకు పొజిషన్ పట్టాలు ఇచ్చే అంశంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఎస్.ఆర్.కె.టి కాలనీలోని 18వ లైన్ సమీపంలో నివసిస్తున్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చే ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యను పరిష్కరించడానికి స్వయంగా రంగంలోకి దిగి, పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న అపర భగీరథుడిగా ఆయన నిలిచారు. ఒక వైద్యుడిగా ప్రజల నాడి తెలిసిన అరవింద బాబు, నేడు ఒక ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ సమస్యల నాడిని పట్టుకుని పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, నరసరావుపేటను ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు వినూత్న ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రెవెన్యూ సమస్యలను ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తున్నాం అన్నారు. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే విన్నపంపై స్పందించిన జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా అర్హులైన వారందరికీ త్వరలోనే పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాట ఇస్తే తప్పని నైజం, పేదల పట్ల అపారమైన ప్రేమ, నియోజకవర్గ అభివృద్ధిపై మడమ తిప్పని పోరాటం – ఇవే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ని ఒక గొప్ప నాయకుడిగా నిలబెట్టాయి. ఈ పర్యటనలో కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఆయనకు మద్దతు తెలిపారు. నరసరావుపేట భవిష్యత్తు అరవింద బాబు నాయకత్వంలో సురక్షితంగా ఉందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కోటప్పకొండ పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన ధార్మిక ట్రస్ట్ బోర్డ్ చైర్మన్

## ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట పెన్ పవర్ మార్చి 24: ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన ధార్మిక ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాసరి శ్రీనివాసరావు కి, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఘన స్వాగతం పలికారు. కోటప్పకొండ చేరుకున్న చైర్మన్ కి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు కలిసి శ్రీ త్రికోటేశ్వరయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనాలు అందించి, స్వామి వారి శేషవస్త్రం మరియు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్ర పరిధిలో భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఆలయ అభివృద్ధి పనులు మరియు భవిష్యత్తులో చేపట్టబోయే ధార్మిక కార్యక్రమాలపై చైర్మన్ తో ఎమ్మెల్యే చర్చించారు.

హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ధార్మిక ట్రస్ట్ బోర్డ్ ద్వారా దాసరి శ్రీనివాసరావు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ పార్టీ ముఖ్య నేతలు మరియు కూటమి నేతలు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సమీక్ష, వివరాలు వెల్లడించిన ఎంపీడీవో బి. కృష్ణ కుమారి





నరసరావుపేట పెన్ పవర్ మార్చి 24: నరసరావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, మండలాల్లో జరుగుతున్న వివిధ పనులు మరియు రావలసిన నిధులపై శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరసరావుపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ ) బి. కృష్ణ కుమారి పాల్గొని, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని ఎమ్మెల్యే కి సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, సచివాలయ భవనాలు మరియు ఇతర ప్రభుత్వ కట్టడాల పురోగతిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదల కావాల్సిన గ్రాంట్ల వివరాలను నివేదించారు. నిధుల కొరత కారణంగా కొన్ని పనులు మందగించాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల విడుదల కోసం చొరవ చూపాలని ఆమె ఎమ్మెల్యే ని కోరారు. అధికారుల వివరణపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, అభివృద్ధి పనుల అమలులోనూ ఎటువంటి జాప్యం ఉండకూడదని ఆదేశించారు.

గ్రామాల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి కనీస సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల కోసం సంబంధిత ఉన్నతాధికారులతో మరియు ప్రభుత్వంతో మాట్లాడి, యుద్ధ ప్రాతిపదికన నిధులు వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# కొనుగోలు కేంద్రాల కోసం రైతుల ఆందోళన

వినుకొండ, యడ్లపాడు : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 24: జొన్న, మొక్కజొన్న, శనగ పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు రైతుసంఘం ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు మండల కేంద్రాల్లో సోమవారం ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగంగా శావల్యాపురం తహశీల్దార్ కార్యాలయాన్ని రైతులు ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని, పంట చేతికొచ్చి 15 రోజులు దాటినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని విమర్శించారు. మర్క్‌ఫెడ్ ద్వారా క్వింటాళ్ రూ.2400 మద్దతు ధరకు కొంటామనే ప్రకటన ఇంకా అమలులోకి రాలేదన్నారు. ఇప్పటికే రైతులు అప్పుల ఒత్తిళ్లతో ఇబ్బంది పడుతున్నారని, పంట అమ్ముకోవాల్సిన నేపథ్యంలో దళారులు క్వింటాళ్ రూ.1700కు మించి కొనడం లేదని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు.

# నరసరావుపేటలో విబి-బిరామ్ జి పథకంపై అవగాహన సదస్సు

## ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట పెన్ పవర్ మార్చి 24: నరసరావుపేట మండల పరిషత్ మీటింగ్ హాల్ లో మంగళవారం విబి-బిరామ్ జి పథకం పై క్లస్టర్ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విబి-బిరామ్ జి పథకం ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన సేవలను అత్యంత పారదర్శకంగా, వేగంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పథకంపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలందించడం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ పథక ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట క్లస్టర్ పరిధిలోని ప్రజా ప్రతినిధులు మరియు పథక సిబ్బందికి ఈ పథకం యొక్క ఉద్దేశ్యాలు,

అమలు తీరు మరియు ప్రజలకు చేకూరే ప్రయోజనాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మండల స్థాయి అధికారులు, పథక కార్యకర్తలు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# నగరాభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 24. మంగళవారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆయన ఛాంబర్ లో గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనుల పై రాష్ట్ర పురపాలన సంచాలకులు సంపత్ కుమార్, కమిషనర్ కె. మయూర్ అశోక్, యం.యల్.ఏ లు మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు మరియు నగర పాలక సంస్థ విభాగాదిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలన శాఖ మంత్రి గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకొని, నియోజకవర్గాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల పై సమీక్షించారు. నగర పాలక సంస్థ నిధుల వివరాలు అడిగి తెలుసుకొని, రానున్న కాలంలో నగర పాలక సంస్థ చేపట్టనున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్ట్ లను క్షేత్ర స్తాయిలో వేగవంతం చేయాలన్నారు. నగరంలో మురుగు నీటి పారుదల మెరుగుదలకు అవసరమైన డ్రైన్ల నిర్మాణానికి ప్రభుత్వం నుండి అదనపు నిధులను కేటాయిస్తామన్నారు. వేసవి కాలం దృష్ట్యా త్రాగు నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారులతో పాటు ఖాళీ స్తలాలు, పార్కులలో పచ్చదనం పెంపుకు ప్రణాలికాబద్దంగా ముందుకెళ్లాలన్నారు. త్వరలో లబ్దిదారులకు అందించనున్న టిడ్కో ఇళ్ళు పూర్తి స్తాయిలో సిద్దం చేయడంతో పాటు, ఖాళీగా ఉన్న ప్లాట్లను అర్హులైన లబ్దిదారులకు కేటాయించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో భవన నిర్మాణాల కొరకు దరఖాస్తు చేసుకున్న ఆర్జీలను, యల్.ఆర్.యస్ మరియు లే అవుట్ అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నగరాభివ్రుద్దికి రాష్ట్ర ప్రభుత్వం, నగర పాలక సంస్థ చేపట్టే చర్యలకు ప్రజా ప్రతినిధులు పూర్తి స్తాయిలో సహకరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ విభాగాధిపతులు, నగర పాలక సంస్థ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలి : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా







నరసరావుపేట పెన్ పవర్ మార్చి 24: డ్రగ్స్ మరియు గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని, జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ చర్యలు -- అవగాహన కార్యక్రమాల సమీక్షకు సంబంధించి ఎన్సిఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్ ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ కృష్ణారావు తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డీ-అడిక్షన్ సెంటర్ పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులకు అక్రమంగా టొబాకో ఉత్పత్తులు సరఫరా చేస్తున్న వారిపై టాక్స్, ఫుడ్ సేఫ్టీ, పోలీస్, ఈగల్ మరియు ఇతర శాఖలు కలిసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖలు తమ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే సమయంలో ఈగల్ టీమ్ మరియు పోలీస్ శాఖను కూడా కలుపుకొని, నార్కోటిక్స్ అంశాలు మరియు నకార్డ్ సమావేశం ప్రాముఖ్యతపై వివరించి, కఠిన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. అన్ని విద్యాసంస్థల్లో కేవలం ప్రసంగాలు మాత్రమే కాకుండా డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ వంటి కార్యక్రమాలను కూడా నిరంతరం నిర్వహించాలని డిఈఓ మరియు విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశాలు జారీ చేశారు. నశా ముక్త్ భారత్ కార్యక్రమాలను చేపట్టాలని, ప్రతి హాస్టల్ లలో డ్రగ్స్ మరియు గంజాయిపై అవగహన కల్పించాలని, పోస్టర్ లను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలల్లో నోడల్ అధికారిని





నియమించాలని, ప్రతి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఏదైనా డ్రగ్స్ సంబంధిత సమాచారం ఉన్నచో పోలీస్ శాఖకు లేదా ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ తెలిపారు. డ్రగ్ డిపార్ట్మెంట్‌కు సంబంధించి, డ్రగ్స్ అక్రమ విక్రయాలను పూర్తిగా నియంత్రించేందుకు, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా అక్రమంగా(ఎన్ఆర్,ఎక్స) మెడిసిన్స్ ఆర్డర్ చేసి విక్రయిస్తున్న మెడికల్ షాపులపై ప్రత్యేక దృష్టి పెట్టి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి డ్రగ్స్ ముట్టుకోరు అని ఐజిపి చెప్పిన విషయాన్ని తెలియజేశారు. అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలన్నారు. గ్రామాల్లో గంజాయి సాగుపై కింది స్థాయి అధికారులకు, ఫారెస్ట్ బీట్ అధికారులకు, ఈగల్ అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972పై అవగాహన మరింత పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ స్టేడియానికి మహర్దశ తీసుకొస్తాం....ఎమ్మెల్యే నసీర్...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 24. రాష్ట్రంలోనే అతి పెద్దదైన గుంటూరు నగరంలోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియానికి మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియాన్ని ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతులమీదుగా మల్టీపర్పస్ భవన సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం రూ.170 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామని వెల్లడించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం, శానిటేషన్, నూతన భవన నిర్మాణాలు వంటి అభివృద్ధి పనుల నిర్వహణ చేపట్టనున్నామని తెలిపారు. ఖేల్ ఇండియా కార్యక్రమంలో బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం 14 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని, వీటితో మల్టీపర్పస్ భవన సముదాయం నిర్మించబోతున్నామని వెల్లడించారు. 80 అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో నిర్మించే నూతన భవన సముదాయంలో బ్యాడ్మింటన్, షటిల్, బాస్కెట్ బాల్ క్యారమ్స్, స్క్వాష్, డార్మిటరీ ఇలా 19 విభాగాలకు రూములు ఉంటాయని వెల్లడించారు. ప్రతి ఏటా కొంత నిధులు రాబట్టి బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేయడంతో అధ్వాన స్థితికి చేరిందని, దీంతో కుక్కలు సంచరించేవని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రథమంగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నానని తెలిపారు. శానిటేషన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం, క్రీడల ప్రోత్సాహానికి ముందడుగు వేసిందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు....

# అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 24. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా కోస్తాంధ్ర జోన్ జిల్లా అధ్యక్ష మరియు ప్రధాన కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్ హాజరయ్యారు. ఏప్రిల్ 5 నుండి ఏప్రిల్ 14 వరకు బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆ విధంగా అన్ని జిల్లాల ఎస్సీ మోర్చా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు మరియు రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ముఖ్య భూమిక పోషించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రధాన అంబేద్కర్ విగ్రహాల కూడళ్ళలో బైక్ ర్యాలీలు2000 మంది పై న హాజరయ్యే విధంగా ప్రయత్నించాలిఅని అన్నారు. అంతేకాకుండా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జోన్లలో నిర్వహించే సమరసత మార్ధాన్, 10,000 మందిడప్పు కళాకారుల సమావేశం, రక్తదాన శిబిరాలు మరియు కబడ్డీ పోటీలు ను విజయవంతమయ్యే విధంగా ప్రతి ఎస్సీ మోర్చా నాయకుడు బాధ్యత తీసుకోవాలని సురేష్ కోరారు. అంతే కాకుండా కోస్తాంధ్ర జోన్ లోని అన్ని జిల్లాలలో పూర్తి స్థాయిఎస్సీ మోర్చా కమిటీలను త్వరలో పూర్తి చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం అయ్యేవిధంగా మీరందరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ దారా అంబేద్కర్, జిల్లా ప్రధానకార్యదర్శులు రాయపూడి ఏసుబాబు, గట్టుపల్లి అబ్రహం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంతేటి బ్రహ్మయ్య, వల్లూరి గంగాధర్ జోనల్ ఇంచార్జ్ మేకల లక్ష్మణ్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మేళం మధుబాబు, మిగతా కోస్తాంధ్ర జిల్లాలుఅయిననెల్లూరు, ప్రకాశం, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు...


01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# వీధి కుక్కల బీభత్సం..

## యువకుడిపై దాడి, ముఖంపై తీవ్ర గాయాలు..



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 24: చిలకలూరిపేట: పట్టణంలోని సుగాలి కాలనీలో వీధి కుక్కలు మరోసారి పంజా విసిరాయి. మంగళ వారం కాలనీకి చెందిన ప్రవీణ్ అనే యువకుడిపై ఒక వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ తన ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా, ఒక్కసారిగా ఒక వీధి కుక్క అతనిపైకి దూకింది. తప్పించుకునే లోపే కుక్క ప్రవీణ్ ముఖం,పెదవుల మీద బలంగా కొరికింది.ఈ దాడిలో అతనికి తీవ్రరక్తగాయాలయ్యాయి.ప్రవీణ్ కేకలు వేయడంతో గమనించినస్థానికులు వెంటనేఅక్కడికి చేరుకుని కుక్కను తరిమి కొట్టారు. తీవ్రంగాగాయపడిన ప్రవీణ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం అతనికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

భయాందోళనలో ప్రజలు...

ఈ ఘటనతో సుగాలి కాలనీ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత కొంతకాలంగా వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, ఒంటరిగాబయటకు రావాలంటేనే వణుకుపుడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలుఆడుకోవడానికి, వృద్ధులు బయటకురావడానికి భయపడుతున్నారని కాలనీ ప్రజలు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా కుక్కల బెడద తగ్గలేదని వారు ఆరోపిస్తున్నారు.

# నాణ్యత ప్రమాణాలతో రహదా నిర్మాణం చేయాలి



చల్లపల్లి (కృష్ణా) : పెన్ పవర్ మార్చి 24: కూటమి ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం వేగవంతం చేసినట్లు అవనిగడ్డ నియోజవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరంలో ఓ.ఆర్.సీ క్లబ్ పక్కన రూ.45 లక్షలతో చల్లపల్లి- మచిలీపట్నం ఆర్ అండ్ బీ రోడ్డు వద్ద నుంచి హైవే వరకూ నిర్మిస్తున్న హైవే కనెక్టివిటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివఅద్ధి శాఖ మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో పాటు, సాస్కి నిధులతో నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు అభివఅద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రహదారి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్ బాబుకు సూచించారు.

# మళ్లీ రంగంలోకి ప్రశాంత్ కిషోర్

**గుంటూరు, మార్చి 24 పెన్ పవర్:** 2019 ఎన్నికల్లో వైసీపీ సాధించిన ప్రభంజన విజయంలో ప్రశాంత్ కిశోర్ వ్యూహాలు ఎలా సక్సెస్ అయ్యాయో రాష్ట్రంలో అందరికీ తెలిసిందే. అయితే 'రావాలి జగన్ - కావాలి జగన్' నినాదం అప్పట్లో ఏపీని ఊపేసింది. ఊరూరా వైసీపీ జెండా రెపరెపలాడింది. అయితే 2024 ఎన్నికల సమయంలో మాత్రం వైసీపీ చతికిలపడింది. ఇందుకు పీకే దూరమవ్వడమే కారణం. కేవలం ఐప్యాక్ టీమ్‌తోనే జగన్ ఎన్నికలకు వెళ్లడంతో అత్యంత దారుణమైన పరాభవాన్ని మూటగట్టుకున్నారు. జగన్ 175 అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఘోర పరాజయాన్ని చవిచూశారు. అయితే ఇప్పుడు పార్టీని మళ్ళీ గాడిలో పెట్టేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారు. తన పాత మిత్రుడు పీకే వైపు చూస్తున్నట్లు పొలిటికల్స్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది.కాగా 2024 ఎన్నికల ఫలితాలకు ముందు ప్రశాంత్ కిషోర్ చేసిన కొన్ని వ్యాఖ్యలు అప్పట్లో ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని కుండబద్దలు కొట్టారు. అంతేకాదు ఆ అంచనాలే నిజం అయ్యాయి. దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలతో జగన్ ప్రజల్లోకి వెళ్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడంలేదని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీకే వంటి బలమైన వ్యూహకర్త మళ్లీ అవసరమని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు 2029 లక్ష్యాన్ని ఛేదించేందుకు మూడేళ్ల ముందే నుంచి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీకేతో జగన్ సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం రాష్ట్రంలో జోరుగా జరుగుతోంది.ప్రస్తుతం ప్రశాంత్ కిశోర్ బీహార్‌లో జన్ సూరాజ్ పార్టీ పెట్టి ఆ ప్రయాణంలో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన 'నేను వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నాను' అని ప్రకటించారు. కానీ జగన్‌తో ఉన్న పాత పరిచయం కారణంగా వీరి కలయిక మళ్లీ సాధ్యమేననే విశ్లేషణలు జరుగుతున్నాయి. ఐప్యాక్ టీమ్ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తే మళ్లీ విజయవంతమైన ఫలితాలు ఉంటాయని, అటు క్యాడర్‌లోనూ కొత్త ఉత్సాహం వస్తుందని వైసీపీ అగ్రనేతలు భావిస్తున్నారని తెలుస్తోంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సామెత ఉండనే ఉంది. ఈ ప్రకారం జగన్, పీకే మళ్ళీ చేతులు కలిపితే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు జరుగుతాయి. 2024 ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న జగన్.. మళ్లీ పీకే సలహాలు తీసుకుని సరికొత్త 'జగన్ 2.0' వ్యూహాన్ని ఎలా అమలు చేస్తారో చూడాలి.






## రాజ్యసభకు యనమల, సానా

**కాకినాడ, మార్చి 24 పెన్ పవర్:** కూటమిలో రాజ్యసభ రేసు ఆసక్తికరంగా మారింది. త్వరలో ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ కాబోతున్నాయి. దీంతో పెద్దల సభ రేసులో..తెలుగు తమ్ముళ్లు పెద్ద క్యూ కట్టారు. పైరవీల పర్వం నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంది. నాలుగు స్థానాల సీట్లలో టీడీపీకి రెండు, జనసేన, బీజేపీకి చెరో సీటు దక్కే అవకాశం ఉంది. టీడీపీకి దక్కే రెండింటిలో గతేడాది ఎన్నికైన సానా సతీష్ ఏడాదిన్నరలోనే పదవీ విరమణ చేస్తుండటంతో ఆయనకు మళ్లీ రెన్యూవల్ చేస్తారని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీకి కొత్తగా దక్కేది ఒక్క సీటేనన్న అంచనాలు ఉన్నాయి.ఆ ఒక్క సీటు కోసం టీడీ జనార్ధన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన సీఎం చంద్రబాబు రాజకీయ కార్యదర్శిగా ఉన్నారు. టీడీపీ మాజీ పొలిట్ బ్యూరో మెంబర్, గతంలో ఎమ్మెల్సీ. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో టీడీ జనార్ధన్‌ను రాజ్యసభకు పంపితే..ఢిల్లీ పనులన్నీ చక్కబెడతారని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే టైమ్‌లో మరో సీనియర్ లీడర్ యనమల రామకృష్ణుడు రాజ్యసభ బెర్త్ కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.తెలుగుదేశం పార్టీ పుట్టిన దగ్గర నుంచి యనమల రామక్రిష్ణుడు పార్టీలో ఉన్నారు. 1983లోనే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి..ఎన్టీఆర్ మంత్రి వర్గంలోనే కీలక మంత్రి పదవులు నిర్వహించారు. ఇక చంద్రబాబు హయాంలో స్పీకర్‌గానే కాకుండా ఆర్థిక మంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేస్తూ ఎన్నో బడ్జెట్లను ప్రవేశపెట్టారు. పన్నెండేళ్ల పాటు ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే యనమల చిరకాల కోరిక రాజ్యసభకు వెళ్లాలని. దశాబ్ధ కాలంగా ఆయన పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్నారు. కానీ ఇప్పటివరకు అవకాశం లేదు.ఇప్పుడా ఆ ముహూర్తం దగ్గర పడిందా అంటే అవుననే ప్రచారం జరుగుతోంది. అయితే సానా సతీష్‌కు రెన్యూవల్ చేయగా..మిగిలిన సీటును సీనియర్లలో ఎవరికో ఒకరికి ఇవ్వాలని చంద్రబాబు ఫిక్స్ అయినట్లు టాక్. పైగా ఆ సీటు బీసీలకు ఇస్తారని అంటున్నారు. ఈ రెండు ఈక్వేషన్స్ బట్టి చూస్తే యనమల స్వీట్ న్యూస్ పక్కా అన్న మాట బలంగా వినిపిస్తోంది. గతేడాది మార్చిలోనే ఆయన ఎమ్మెల్సీ పదవి గడువు ముగిసింది. దీంతో పెద్దాయనకు సముచితమైన గౌరవం దక్కాలంటే కచ్చితంగా రాజ్యసభకు పంపడమే బెటర్ అని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.యనమల చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఆంతరంగికుడిగా మెలుగుతారు కూడా. ఇద్దరూ సమ వయస్కులు. ఇద్దరూ రాజకీయంగా కలసి మెలసి ఉంటూ టీడీపీలో కీలక దశకు చేరుకున్న వారు. దాంతో చంద్రబాబు తన మిత్రులకు..పైగా సీనియర్లకు గౌరవనీయమైన స్థానం కల్పించే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. గతేడాది సీనియర్ లీడర్ అశోక్ గజపతి రాజుకు గోవా గవర్నర్‌గా అవకాశం దక్కింది. ఇప్పుడు మరో సీనియర్ నేత యనమల వంతు వచ్చిందని..ఆయనకు రాజ్యసభ సీటు రిజర్వ్ అయిందని చెబుతున్నారు. త్వరలోనే చంద్రబాబు నోట యనమలకు గుడ్ న్యూస్‌ను వినిపించబోతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.అయితే ఈ మధ్యే యనమల అల్లుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం పెద్ద రచ్చగా మారింది. ఆ ఎఫెక్ట్‌తో యనమల అవకాశాలు ఏమైనా పోతాయా అనే ప్రచారం నడుస్తుండగా..అలాంటిదేమీ లేదని అంటున్నారు. యనమల టీడీపీ పుట్టినప్పటి నుంచి నిబద్ధతతో పార్టీకి సేవ చేస్తున్న లీడర్. ఆయన అనుభవం, పార్టీకి చేసిన సేవ లెక్కలోకి వస్తాయని చెబుతున్నారు. మొత్తానికి యనమల పెద్దల సభలోకి అడుగు పెట్టాలన్న కోరిక మరో రెండు నెలలలో తీరిపోతుందని అంటున్నారు. లాస్ట్ మినిట్ ఏమైనా మార్పులు చేర్పులు జరుగుతాయా? లేక యనమలకు బెర్త్ పక్కానా అనేవి చూడాలి.

## డ్యామేజ్ కంట్రోల్ కోసం వైసీపీ రూట్ మార్చిందా?

**విశాఖపట్టణం, మార్చి 24 పెన్ పవర్:** ఏపీ పాలిటిక్స్‌లో గాజువాకకు స్పెషల్ పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లాగా..ఇక్కడ క్యాస్ట్ పాలిటిక్స్ చేయడం అంత ఈజీ కాదన్న అభిప్రాయం ఉంది. అయితే గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగానే కాదు..గాజువాకలోనూ వైసీపీ వేసిన వ్యూహాలు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు. ఘోర పరాజయం తప్పలేదు. దీంతో ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలకు ముందు వైసీపీ పెద్దలు కాస్త అలర్ట్ అయినట్లు కనిపిస్తోంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైసీపీ స్టేట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యుడిగా నియమించింది. వైసీపీకి పీఏసీ అనేది చాలా ప్రెస్టీజియస్. సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు, కీలక నేతలకు మాత్రమే చోటు దక్కుతుంది.కానీ గాజువాకలో కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల నాగిరెడ్డిని పీఏసీలోకి తీసుకోవడం వెనుక వైసీపీ స్ట్రాటజీ ఏంటన్నది విశాఖ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. నాగిరెడ్డి కేవలం ఒకే ఒక్కసారి గెలిచినా సరే సంచలన విజయాన్ని రికార్డు క్రియేట్ చేశారు. 2019లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను 16వేల ఓట్లతో ఓడించి తన పేరు రీసౌండ్ చేసేలా గుర్తింపు పొందారు. అయితే మాత్రం ఏం లాభం..గత ఎన్నికల్లో వైసీపీ అనూహ్యంగా ఆయన్ను పక్కన పెట్టింది. వృద్ధాప్యం..అనారోగ్యం..కారణంగా తన కుమారుల్లో ఎవరో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ నాగిరెడ్డి హైకమాండ్‌కు ఛాయిస్ ఇచ్చి సైలెంట్ అయిపోయారు.పవన్‌ను ఓడించిన నేతగా నాగిరెడ్డికి క్రెడిట్ ఉన్నా తన కుమారులకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన చేసిన రిక్వెస్ట్‌ను వైసీపీ అధిష్టానం లైట్ తీసుకుంది. క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో యాదవ సామాజికవర్గానికి చెందిన నేతను బరిలో నిలిపితే విజయం వరిస్తుందని అంచనా వేసి ఉరుకూటి చందు అనే నేతకు నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగించారు. వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం గాజువాకలో గందరగోళం సృష్టించినా సరే పార్టీ పెద్దలు వెనక్కి తగ్గలేదు. యాదవ సామాజికవర్గానికి చెందిన ఉరుకూటి చందుకే టికెట్ అనే సంకేతాలను బలంగా పంపారు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో..కాపు సామాజికవర్గానికి చెందిన గుడివాడ అమర్‌నాథ్‌ను లాస్ట్ మినిట్‌లో గాజువాక బరిలోకి దించారు. కూటమి తరుపున యాదవ సామాజికవర్గ నేత పల్లా శ్రీనివాసరావు బరిలోకి దిగడంతో..కాపు ఈక్వేషన్స్..స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంటూ వైసీపీ వేసిన స్కెచ్‌లన్నీ గాల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యేల్లో..గాజువాకలోనే టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చింది.ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు వైసీపీ పెద్దలకు అసలు సీన్ అర్థమైందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలో స్థానిక, విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు రానుండటంతో పట్టు నిలుపుకోవాలన్న ఉద్దేశంతో కీలక నిర్ణయాలు తీసుకుంటుందట. ఇందులో భాగంగా తిప్పల నాగిరెడ్డిని మళ్లీ తెరపైకి తెచ్చారని అంటున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్నానని, వయోభారంతో రాజకీయాల్లో కొనసాగలేనని రెండేళ్ల క్రితమే చేతులెత్తేసిన తిప్పల నాగిరెడ్డిని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ తెస్తూ..పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మెంబర్‌గా నియమించింది. ఈ నిర్ణయం వెనుక వైసీపీ పెద్ద కసరత్తే చేసిందన్న టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం వైసీపీకి గాజువాకలో దిక్కూమొక్కూ లేదు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన గుడివాడ అమర్‌నాథ్ చోడవరం నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దీంతో వైసీపీకి నియోజకవర్గాన్ని నడిపే నాయకుడు కరువయ్యాడు. గ్రేటర్ విశాఖ సిటీలోనే ఇలాంటి దుస్థితి ఉంటే కష్టమని భావించి నాగిరెడ్డికి హితబోధ చేసి మరీ ఈ బాధ్యతలు అప్పగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంగతి తర్వాత ముందు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని నాగిరెడ్డికి టాస్క్ ఇచ్చారట. చెరోదారిలో వెళ్లిపోయిన తన కుమారులను కూడా దారికి తెచ్చుకుని పార్టీకో దారి చూపిస్తారనే ఆశలతోనే వైసీపీ నాగిరెడ్డికి పీఏసీ చాన్స్ ఇచ్చారని అంటున్నారు. కూటమి నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని నాగిరెడ్డి గాజువాకలో వైసీపీకి పూర్వవైభవం తీసుకొస్తారో లేదో చూడాలి.

# జ్ఞాపకంగా కృష్ణా ప్యాలెస్‘

**విజయవాడ, మార్చి 24, పెన్ పవర్:** కృష్ణా నదిపై బ్రిటిషర్ల హయాంలో నిర్మించిన బ్రిడ్జి చరిత్రలో జ్ఞాపకంగా మిగలబోతోంది. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి పిల్లర్ల కూల్చివేతలు మొదలు పెట్టారు. కొత్త డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఈ పాత బ్రిడ్జి పిల్లర్లను కూల్చివేయబోతున్నారు.హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో కూల్చివేతలు సాధ్యం కాకపోవడంతో.. అధికారులు లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో కూల్చేందుకు సిద్ధమవుతున్నారు.130 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన బ్రిటీష్ కాలం నాటి రైల్వే బ్రిడ్జి కనమరుగు కాబోతోంది. 1893లో ప్రారంభించిన ఈ బ్రిడ్జి స్థానంలో కొత్తగా డబుల్ లైన్ బ్రిడ్జిని నిర్మించడం కోసం రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. గతంలోనే ఈ బ్రిడ్జిపై ఉన్న నిర్మాణాన్ని కూల్చివేయగా.. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను తొలగించే పనులు చేపట్టారు. రెండు వారాలకు పైగా హైడ్రాలిక్ క్రేన్ల సహాయంతో పిల్లర్లను పగలగొట్టాలని ప్రయత్నించారు.. కానీ వీలు పడలేదు. అందుకే ఈ పిల్లర్లను కూల్చివేసేందుకు లిమిటెడ్ బ్లాస్టింగ్ పద్ధతిలో కూల్చివేతలు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో ఒక్కో పిల్లర్‌ను తొలగించుకుంటూ పోతారు. దీనికి చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. 1856 ప్రాంతంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎం (మద్రాస్ టు సదరన్ మరాఠా) రైల్వేలో విజయవాడ ఓ భాగంగా ఉండేది. 1893లో కృష్ణానదిపై మూడు కిలోమీటర్ల పొడవున మీటర్ గేజ్ విధానంలో ఈ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారు. వంతెన ప్రవేశ మార్గంలో కోట బురుజులను తలపించే రెండు నిర్మాణాలు ఉండటం, అవి చూసేందుకు ప్యాలెస్‌ను తలపించడంతో.. ఈ బ్రిడ్జికి కృష్ణా ప్యాలెస్‌గా పేరు పెట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి స్టీల్ వాడకుండా రాతి బండలు, గానుగ సున్నం సాయంతోనే అత్యంత పటిష్టంగా నిర్మించారు. అందుకే ఇన్నేళ్లు గడిచినా పిల్లర్లను కూల్చడానికి శ్రమించాల్సి వస్తోంది.1897లో ఈ రైల్వే బ్రిడ్జిని బ్రాడ్ గేజ్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం రైల్వేశాఖ ఈ బ్రిడ్జికి తూర్పు, పశ్చిమ వైపున రైల్వే బ్రిడ్జిలు నిర్మాణం చేసింది. 1985 వరకు ఈ వంతెన సేవలు అందించింది. 1993లో అధికారికంగా ఈ వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఆ తర్వాత కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి వయాడక్ట్‌ను తొలగించగా.. అప్పటి నుంచి ఈ పిల్లర్లు మాత్రమే ఉండిపోయాయి. అయితే ప్రస్తుతం విజయవాడ, గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడంతో.. డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని ప్లాన్ చేశారు. అందుకే ప్రస్తుతం చారిత్రక కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు.130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్లను తొలగించొద్దని కోరుతూ గతంలో కొందరు రైల్వే అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఈ బ్రిడ్జి జోలికి వెళ్లలేదు.. కానీ ఇప్పుడు డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి కోసం కృష్ణా ప్యాలెస్ వంతెన పిల్లర్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఈ వంతెన పిల్లర్లను అలాగే వదిలేసి కొంత దూరంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలన్నా అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే ఈ పాత బ్రిడ్జిని తొలగించి..

కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ప్లాన్ చేశారు. ముందుగా పిల్లర్లను తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు.కానీ వంతెన పిల్లర్లు ఇప్పటికీ పటిష్టంగా ఉండటంతో.. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో వాటిని తొలగించడం సాధ్యం కాలేదు. అందుకే లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో ఈ పిల్లర్లను కూల్చే పనులు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో తక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను ఉపయోగించి, పిల్లర్లకు పగుళ్లు వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో తొలగిస్తారు. దీంతో విజయవాడ చరిత్రలో 'కృష్ణా ప్యాలెస్' వంతెన జ్ఞాపకంగా మిగలబోతోంది

# కొండెక్కిన కోడి



**నెల్లూరు, మార్చి 24 పెన్ పవర్:** మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్. ఎందుకంటే చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న చికెన్ ధరలు.. తాజాగా భారీ స్థాయిలో ఎగబాకుతోంది. ధరలు కొండెక్కుతున్నాయి. ఆదివారం బహిరంగ మార్కెట్‌లో కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ.340 వరకు ఉండగా, అదే వారం రోజుల కిందట కిలో చికెన్ ధర రూ.260 వరకు ఉంది. చికెన్ ధరలు ఒక్కసారి పెరగడంతో సామాన్యులు కష్టంగా మారిపోయింది. ముందే యుద్ధం కారణంగా ఒక్కొక్కటిగా ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు చికెన్ ధరలు పెరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉంటే మరోవైపు కోడి గుడ్డు ధర మాత్రం పడిపోతున్నాయి. గతంలో ఒక గుడ్డు ధర రూ.8 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.4..20 పైసల వద్ద కొనసగుతోంది. కోడిగుడ్లు ఎగుమతి ఆగిపోవడంతో ధరలు పడిపోయాయని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి కోడిగుడ్లు తమిళనాడుకు తీసుకెళ్లి అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. కానీ ప్రస్తుతం యుద్ధం కారణంగా గల్ఫ్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో గుడ్డు ధర అమాంతంగా పడిపోయింది.చికెన్ ధర పెరగడానికి బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదకత తగ్గడం, రంజాన్, ఇతర ఫంక్షన్ల కారణంగా చికెన్ ధరలు పెరగడానికి కారణమని చెబుతున్నారు చికెన్ దుకాణ వ్యాపారులు. డిమాండ్‌కు సరిపడా చిన్న బ్రాయిలర్ కోళ్లు కూడా దొరకడం లేదట. అలాగే పౌల్ట్రీ నిర్వాహకులు పిల్లల పెంపకం ఆపేదయం కూడా మరో కారణం అంటున్నారు. కోళ్ల డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేని కారణంగా చికెన్ ధరలు భారీగా పెరుగుతున్నాయని చెబుతున్నారు.

# కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం

**గుంటూరు, మార్చి 24 పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలో గిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచేయలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే.ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ.5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుండానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది. ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది.ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చి కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ.20 వేలకు పైగానే ధర పలుకుతోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ.19,500కు చేరుకుంది. తాలు రకం కూడా క్వింటాలు ధర రూ.10 వేలకు పైగానే పలుకుతుంది. ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చికి ధరల్లో ఘననీయమైన పెరుగుదల కనిపించింది. పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చి నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో ధరలు ఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతిన ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది.

### రైతులకు ఆనందం

వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ.20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తున్నారు.మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళవారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ.10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ.20 వేల ధర పలుకుతోంది.సన్న రకాలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉన్న తేజ మిర్చి క్వింటాల్ ధర ప్రస్తుతం రూ.19,500కు చేరింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నారు.ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

# చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట.. ఆ 11 మందికి స్టేడియంలో పర్మినెంట్ ప్లేస్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 విజయోత్సవ వేడుకల్లో చనిపోయిన ఫ్యాన్స్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) సహకారంతో చనిపోయిన అభిమానుల పేర్లపై స్టేడియంలో శాశ్వత సీట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. కాగా ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆర్సీబీ చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియం ప్రవేశ ద్వారం దగ్గర 11 మంది ఫ్యాన్స్ మృతుల జ్ఞాపకార్థం ఒక స్మారక ఫలకాన్ని ఆవిష్కరించబోతుంది. అంతేకాదు, స్టేడియంలోని 11 సీట్లను శాశ్వతంగా వారి పేరుపై రిజర్వ్ చేసి.. ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచాలని నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఇక్కడ జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌లు సహా అన్ని ఈవెంట్లలో ఈ సీట్లు ఖాళీగానే కనిపిస్తాయని అధికారులు తేల్చి చెప్పారు. 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం 11వ నెంబర్ ప్రాక్టీస్ జెర్సీలను ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ ధరించొద్దన్నారు. ఈ విషయాన్ని ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్ ఇవాళ తెలియజేశారు. ఇది మా ప్రయాణంలో మాతోనే నడిచిన మా ఫ్యాన్స్ కోసం మేము అర్పించే నివాళి అన్నారు. మ్యాచ్ రోజు ఆటగాళ్లంతా నల్లని కళ్లద్దాలను కూడా ధరిస్తారని పేర్కొన్నారు.

ఐపీఎల్ 2025లో జరిగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ విజేతగా నిలిచింది. 18 ఏళ్ల తర్వాత ట్రోఫీని గెలవడంతో ఆర్సీబీ ఫ్యాన్స్ ఆనందానికి హద్దేలేకుండా పోయింది. జూన్ 4న బెంగళూరులో నిర్వహించిన విజయోత్స వేడుక తీవ్ర విషాదంగా మారింది. ఈ విజయోత్స వేడుకలను చూసేందుకు లక్షల్లో అభిమానులు తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 50 మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో చిన్నారులతో పాటు మహిళలు కూడా ఉన్నారు.

# అమ్ముడుపోయిన రాజస్థాన్ రాయల్స్.. ఏకంగా రూ. 15 వేల కోట్లకు..





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత భారీ డీల్ నమోదు అయింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు అమ్మకం ప్రక్రియ ఎట్టకేలకు పూర్తైంది. భారత సంతతికి చెందిన అమెరికన్ పారిశ్రామికవేత్త కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం, ఈ జట్టును 1.63 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసినట్లు జాతీయ మీడియాలో వార్త కథనాలు వస్తున్నాయి. ఇండియన్ కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 15,280 కోట్ల వరకు ఉంటుంది. దీంతో ఒక బిలియన్ డాలర్లకు విక్రయించిన తొలి ఐపీఎల్ జట్టుగా రాజస్థాన్ చరిత్ర సృష్టించింది.

**అధికారికంగా జట్టు బాధ్యతలు:**

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత ఈ కొత్త యాజమాన్యం జట్టు బాధ్యతలను అధికారికంగా చేపట్టనుంది. గతంలో ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ లక్నో సూపర్ జెయింట్స్‌ను 940 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు రాజస్థాన్ ఆ రికార్డును అధిగమించింది. అయితే కల్ సోమాని కన్సార్టియానికి వాల్‌మార్ట్ ఫ్యామిలీకి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే ఎన్ఎఫ్ఎల్ జట్టు డెట్రాయిట్ లయన్స్‌లో మెజారిటీ వాటాలు కలిగిన హాంప్ కుటుంబం నుంచి ఆర్థికంగా సపోర్టు ఉంది.

**ఎవరీ కల్ సోమాని?:**

అరిజోనాకు చెందిన కల్ సోమాని ఒక ప్రముఖ ఎంట్రప్రెన్యూర్. ఆయనకు డేటా ప్రైవసీ, ఎడ్‌టెక్ , క్రీడా సాంకేతికత లాంటి రంగాల్లో 15 ఏళ్లకు పైగా అనుభవం కలిగి ఉన్నారు. అతడు ఇంట్రాఎడ్జ్, ట్రూయో వంటి సంస్థలకు వ్యవస్థాపకుడిగా కొనసాగుతున్నారు. 2021 నుంచే ఆయనకు రాజస్థాన్ రాయల్స్‌లో మైనారిటీ వాటాని కలిగి ఉన్నారు. తాజాగా ఇప్పుడు 100 శాతం వాటాను దక్కించుకున్నారు. క్రీడల పట్ల ఇంట్రెస్ట్ ఉన్న సోమాని.. మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్‌కు సహ-యజమానిగా, TGL గోల్ఫ్ లీగ్‌లలో తొలి పెట్టుబడిదారులలో ఒకరిగా ఉన్నారు.

# ఎస్ఆర్‌హెచ్ vs ఆర్సీబీ మ్యాచ్‌కి బిగ్ షాక్.. ఆరోజు వర్షం పడే ఛాన్స్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన పోరుతో ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మార్చి 28వ తేదీన రాత్రి 7:30 గంటలకు ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. కాగా ఈ మ్యాచ్‌పై నీలి నీడలు కమ్ముకునేలా కనిపిస్తున్నాయి. మార్చి 28వ తేదీన బెంగళూరులో వర్సం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ ఆరోజు వర్షం అంతరాయం కలిగించకుండా ఉంటే, ఈ మ్యాచ్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠభరితమైన ఓపెనింగ్ మ్యాచ్‌లలో ఒకటిగా నిలుస్తుంది.

**గెలిచే అవకాశం ఎవరికి?:**

గణాంకాల ప్రకారం, సొంత గడ్డపై ఆడుతుండటంతో ఆర్సీబీకి 54 శాతం గెలిచే అవకాశం ఉండగా, ఎస్ఆర్‌హెచ్‌కు 46 శాతం ఛాన్స్ ఉంది.

ూా=ఎ దూకుడు: హైదరాబాద్ జట్టులో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ వంటి విధ్వంసకర ఓపెనర్లు ఉన్నారు. హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, లియామ్ లివింగ్‌స్టోన్‌లతో హైదరాబాద్ బ్యాటింగ్ లైన్-అప్ చాలా బలంగా ఉంది. మ్యాచ్ ప్రారంభమైన తొలి ఓవర్ నుంచే అటాకింగ్ గేమ్‌ను ఆడటమే వీరి ప్రధాన వ్యూహంగా ముందుకు వెళ్తున్నారు.

RCB **బలం:** సొంత గడ్డపై ఆడుతుండటం ఆర్సీబీకి కలిసొచ్చే అంశం. విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్ ఓపెనింగ్ జోడీపై భారీ అంచనాలు పెట్టుకుంది ఆర్సీబీ యాజమాన్యం. మిడిల్ ఆర్డర్‌లో రజత్ పాటిదార్, జితేష్ శర్మ, టిమ్ డేవిడ్ వంటి పవర్‌ఫుల్ హిట్టర్లు ఉన్నారు.

**పిచ్ రిపోర్ట్:**

బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామం అని చెప్పాలి. ఇక్కడ 180 పరుగులు కూడా సాధారణ స్కోరుగా పరిగణించబడుతుంది. ఒకవేళ 200ం దాటితే అది గెలిచేందుకు భావించే స్కోర్ గా పేర్కొంటారు. ఈ మైదానంలో చిన్న బౌండరీలు ఉండటంతో సిక్సర్ల వర్షం ఖాయం.

**వెదర్ రిపోర్ట్:**

పగటిపూట గరిష్టంగా 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

సాయంత్రం వేళ 60 శాతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తుంది.

మార్చి 28న సాయంత్రం గంటకు 30 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు, పిడుగులతో కూడిన వర్షం మ్యాచ్‌కు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అంచనా:** ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, మంగేష్ యాదవ్

**సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అంచనా:** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (కెప్టెన్/వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, హర్షల్ పటేల్, లియామ్ లివింగ్‌స్టోన్, జీషన్ అన్సారీ, ఈషన్ మలింగ, జయదేవ్ ఉనద్కత్

**బిగ్ బాస్ నుండి సిల్వర్ స్క్రీన్‌కి బ్రైట్ లెహెంగా వైబ్స్ మరియు బాత్‌ని మెరిసిన ఆశు రెడ్డి**



# ధురంధర్ 2 టాప్ ప్లేస్ కొడుతుందా? దంగల్ ను బీట్ చేస్తుందా?



బాలీవుడ్ లో భారీ సంచలనం సృష్టిస్తున్న చిత్రం ధురంధర్: ది రివెంజ్. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఆ స్పై థ్రిల్లర్ లో రణవీర్ సింగ్ లీడ్ రోల్ లో నటించిన విషయం తెలిసిందే. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డుల వర్షం కురిపిస్తూ దూసుకుపోతోంది. విడుదలైన నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా సుమారు రూ.750 కోట్ల గ్రాస్ వసూలు చేయడం విశేషం.విడుదలకు ముందు నిర్వహించిన పెయిడ్ ప్రివ్యూ ద్వారా రూ.43 కోట్లు రాబట్టిన ఆ చిత్రం, విడుదలైన తర్వాత కూడా అదే ఊపును కొనసాగించింది. ముఖ్యంగా ఆదివారం ఒక్కరోజే దేశీయ మార్కెట్ లో రూ.115 కోట్లు వసూలు చేసి కొత్త రికార్డు నెలకొల్పింది. హిందీ చిత్రసీమలో ఇప్పటి వరకు ఉన్న ఓపెనింగ్ వీకెండ్ రికార్డులు అధిగమించింది. ముఖ్యంగా బ్లాక్ బస్టర్ హిట్ మూవీ పఠాన్ సాధించిన ఓపెనింగ్ వీకెండ్ కలెక్షన్లను సునాయాసంగా దాటేసింది ధురంధర్: ది రివెంజ్ మూవీ. ఓవర్సీస్ మార్కెట్ లో కూడా ఆ సినిమా ప్రభంజనం సృష్టిస్తూ సుమారు రూ.180 కోట్లు వసూళ్లు నమోదు చేసింది. భారతీయ సినీ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్ వీకెండ్ సాధించిన చిత్రాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. బాహుబలి 2: ది కన్ క్లూజన్, ఆర్ఆర్ఆర్, కల్కి 2898 ఏడీ వంటి చిత్రాల రికార్డులు బ్రేక్ చేసింది. అదే సమయంలో ధురంధర్: ది రివెంజ్ త్వరలోనే రూ.1000 కోట్ల క్లబ్ లో చేరే అవకాశముంది. అదే వేగం కొనసాగితే లాంగ్ రన్ లో రూ.2000 కోట్ల మార్క్ ను కూడా చేరుకునే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే ఇప్పటివరకు భారతీయ సినీ చరిత్రలో రూ.2000 కోట్ల మార్క్ ను అందుకున్న ఏకైక చిత్రం దంగల్ మాత్రమే. ఆ చిత్రం సుమారు రూ.2070 కోట్ల వసూళ్లతో టాప్ లో నిలిచింది. దాని తర్వాత బాహుబలి: ది కన్ క్లూజన్ (రూ.1788 కోట్లు), పుష్ప 2: ది రూల్ (రూ.1742 కోట్లు) తదితర చిత్రాలు నిలిచాయి. ఒకసారి ఆ లిస్ట్ ను చూద్దాం.

**1.దంగల్: రూ.2070 కోట్లు**
**2.బాహుబలి 2: రూ.1788 కోట్లు**
**3.పుష్ప 2: రూ.1742 కోట్లు**
**4.ధురంధర్: రూ.1307 కోట్లు**
**5.ఆర్ఆర్ఆర్: రూ.1230 కోట్లు**
**6.కేజీఎఫ్ 2: రూ.1215 కోట్లు**
**7.జవాన్: రూ.1160 కోట్లు**
**8.కల్కి 2898 ఏడీ: రూ.1042 కోట్లు**
**9.కాంతార 1: రూ.852 కోట్లు**
**10.ఛావా: రూ.808 కోట్లు**

ఈ నేపథ్యంలో ధురంధర్: ది రివెంజ్ మూవీ లాంగ్ రన్ లో ఎంత వసూళ్లు సాధిస్తుంది? దంగల్ రికార్డును బ్రేక్ చేయగలదా? అనే విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ప్రేక్షకుల ఆదరణ ఇదే విధంగా కొనసాగితే, ఇండియన్ బాక్సాఫీస్ చరిత్రలో సరికొత్త అధ్యాయం నమోదు కావడం ఖాయమని అంతా భావిస్తున్నారు. మరి చూడాలి ఏం జరుగుతుందో..

**సాక్షి మాలిక్ ఒక ప్రో లాగా అథ్లెయిజర్‌ను ఎలా చంపాలో చూపిస్తుంది**



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965